న్యూ మలక్‌పేట్ రోడ్డులో భారీ గుంత

...తప్పిన ప్రమాదం

మలక్ పేట, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: న్యూ మలక్‌పేట్ రోడ్డులో లాల్జార్ హోటల్ సమీపంలో ఇటీవల మట్టితో పూడ్చిన రోడ్ ప్యాచ్ అకస్మాత్తుగా కూలిపోవడంతో భారీ గుంత ఏర్పడింది. ఆ సమయంలో రోడ్డుపై వెళ్తున్న ట్రాక్టర్ కారణంగా ప్యాచ్ వర్క్ కుంగిపోవడంతో వాక్యూమ్‌లా లోతైన గుంత ఏర్పడింది. గుంతలో నీటి పైప్ లైన్ లీకేజ్ కూడా కనిపించింది.సమాచారం అందుకున్న వెంటనే దబీర్‌పురా పోలీసులు, మలక్‌పేట్ ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గుంత చుట్టూ బ్యారికేడ్లు ఏర్పాటు చేసి పెద్ద ప్రమాదాన్ని తప్పించారు. సమాచారం తెలియడంతో మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల సంఘటన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారులకు సూచించారు.

న్యూ మలక్ పేట రోడ్డులో గుంత ఏర్పడిన దృశ్యం

హైదరాబాద్ వార్త

'గ్రేటర్' మూడుగా విభజన

- -జిహెచ్ఎంసి, సిఎంసి,ఎంఎంసి
- -గెజిట్ విడుదల చేసిన ప్రభుత్వం
- - జిహెచ్ఎంసి కమిషనర్‌గా ఆర్.వి.కర్ణన్
- -సైబరాబాద్ కమిషనర్‌గా జి.సృజన
- -మల్కాజ్‌గిరి కమిషనర్‌గా టి.వినయ్‌కృష్ణారెడ్డి బాధ్యతలు
- -మూడు కార్పొరేషన్లకు ప్రత్యేక అధికారిగా జయేష్ రంజన్

హైదరాబాద్, ఫిబ్రవరి 11,ప్రభాతవార్త: హైదరాబాద్ నగర పాలనా వ్యవస్థలో కొత్త అధ్యాయం మొదలైంది. పరిపాలన సౌలభ్యం, అధికార వికేంద్రీకరణే లక్ష్యంగా ఇప్పటివరకు ఉన్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి)ని ప్రభుత్వం మూడు ప్రత్యేక కార్పొరేషన్లుగా విభజించింది. జిహెచ్ఎంసి, సిఎంసి, ఎంఎంసిగా ఏర్పాటు చేసి ఈమేరకు గెజిట్ విడుదల చేసింది. బుధవారం నుంచి ఈ నూతన కార్పొరేషన్లు అమలులోకి వచ్చాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) కమిషనర్‌గా ఆర్.వి. కర్ణన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ)గా జి.సృజన, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ)గా టి.వినయ్‌కృష్ణారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అలాగే మూడుకార్పొరేషన్‌లకు కలిపి ప్రత్యేక అధికారిగా సీనియర్ ఐఏఎస్ అధికారి జయేష్‌రంజన్‌ను నియమించగా పాత జిహెచ్ఎంసి భవనంలోని మొదటి అంతస్తులోలోని ఛాంబర్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. కాగా హైదరాబాద్ ఓఆర్ఆర్ పరిధిలోని సుమారు 2 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. జీహెచ్ఎంసీ చట్టం1955, సెక్షన్3(1) ప్రకారం ఈవిభజన చేసింది. గతంలో 150 డివిజన్లుగా ఉన్న పాత జీహెచ్ఎంసీ పరిధిని డీలిమిటేషన్ ప్రక్రియ ద్వారా 243 డివిజన్లకు పెంచారు. దీనికి అదనంగా విలీన మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల పరిధిలో మరో 57 డివిజన్లను ఏర్పాటు చేశారు. మొత్తంగా 300 డివిజన్లతో కూడిన నగర పాలక వ్యవస్థ ఇప్పుడు మూడు విభాగాలుగా విడిపోయి ప్రజలకు సేవలు అందించనుం ది. ఈకొత్త వ్యవస్థలో 60 సర్కిళ్లు, 12 జోన్లు కీలకంగా మారనున్నాయి. తెలంగాణ ప్రధాన పట్టణ ప్రాంతం (టిక్యూర్) పరిధిలో ఒకే రకమైన పరిపాలన అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం రెండేళ్ల క్రితమే కసరత్తు ప్రారంభించింది. 2024 సెప్టెంబరులో 51 శివారు గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేయగా.. 2025 నవంబరులో 20 మున్సిపాలిటీలు, 7 నగరపాలక సంస్థలను జీహెచ్ఎంసీలో కలిపేశారు.

తాజాగా (ఫిబ్రవరి 10) పాత పాలకమండలి గడువు ముగియడంతో ప్రభు త్వం వెంటనే విభజన ప్రక్రియను పూర్తి చేసి పాలనా పగ్గాలను నూతన కార్పొరేషన్లకు అప్పగించింది.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

(6జోన్లు -30సర్కిళ్లు -150 వార్డులు)

శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్,గోల్కొండ, ఖైరతాబాద్, సికింద్రాబాద్, జోన్లతో కలిసి జిహెచ్ఎంసిని ఏర్పాటు చేసి దీనికి ప్రస్తుత కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను తిరిగి కమిషనర్‌గా నియమించారు. ఇక్కడ అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే అంబర్‌పేట్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్,ముషీరాబాద్, మలక్‌పేట్, సనత్ నగర్, నాంపల్లి, కార్వాన్, గోషామహాల్, చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా, బహదూర్‌పురా, సికింద్రాబాద్ పూర్తిపరిధి వస్తుండగా, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్, మహేశ్వరం నియోజకవర్గాలు పాక్షికంగా ఉంటున్నాయి.

సర్కిళ్లు..

శంషాబాద్‌జోన్‌లో 4సర్కిళ్లు 17వార్డులు ఉండగా అందులో ఆదిభట్ల (4వార్డులు) బడంగ్‌పేట్ (6వార్డు) జల్‌పల్లి (3వార్డులు)శంషాబాద్(4వార్డులు) ఉండగా రాజేంద్రనగర్ జోన్ 6సర్కిళ్లు 29వార్డులు ఉన్నాయి. అందులో రాజేంద్రనగర్ (4వార్డులు), అత్తాపూర్ (6వార్డులు), బహదూర్‌పురా(5వార్డులు),ఫలక్‌నుమా(4వార్డులు), చంద్రయాన్‌గుట్ట (5వార్డులు),జంగంమెంట్ (5వార్డులు) సర్కిళ్లు ఉన్నాయి. అలాగే చార్మినార్ జోన్‌లో 5సర్కిళ్లు, 25వార్డులు ఉండగా అందులో సంతోష్‌నగర్(4), యాకత్‌పురా (6), మలక్‌పేట్ (4), చార్మినార్(6), ముసారంబాగ్ (5), ఉన్నాయి.అలాగే గోల్కొండ జోన్‌లో 5సర్కిళ్లు, 28వార్డులు ఉండగా అందులో గోషామహాల్ (6), కార్వాన్ (5),గోల్కొండ (7),మెహదీపట్నం (4),మాసబ్ ట్యాంక్ (4) ఖైరతాబాద్‌జోన్‌లో 5సర్కిళ్లు -29వార్డులు ఉండగా అందులో ఖైరదాబాద్ (6),జూబ్లీహిల్స్(4), బోరబండ (5),యూసఫ్‌గూడ (5),అమీర్‌పేట్ (5) ఉన్నాయి. అలాగే సికింద్రాబాద్ జోన్‌లో 5సర్కిళ్లు 28వార్డులు ఉండగా..కవాడిగూడ (7),ముషీరాబాద్ (5),అంబర్‌పేట్ (8),తార్నాక (4),మెట్టుగూడ (4)గా ఉన్నాయి.

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

(3జోన్లు, 16సర్కిళ్లు ,76 వార్డులు)

శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి,, కుత్బుల్లాపూర్‌లతో కలిపి సైబరాబాద్ కార్పొరేషన్ ఏర్పాటు చేయగా దీనికి సీనియర్ ఐఏఎస్ అధికారి జి.సృజనను నియమించారు. ఈకార్పొరేషన్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలు పరిశీలిస్తే కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాలు పూర్తిగా వస్తుండగా, కూకట్‌పల్లి,మేడ్చల్, పటాన్‌చెర్వు,రాజేంద్రనగర్ నియోజకవర్గాలన్నికొంత భాగం సిఎంసిలో కలుస్తుంది.

సర్కిళ్లు..

కూకట్‌పల్లి జోన్‌లో 4సర్కిళ్లు ఉండగా అందులో 24వార్డులు ఉన్నాయి. మాదాపూర్ (6), అల్వీన్‌కాలనీ (6),కూకట్‌పల్లి (6),మూసాపేట్ (5)ఉన్నాయి. అలాగే శేరిలింగంపల్లి జోన్‌లో 5సర్కిళ్లు, 26వార్డులు ఉండగా అందులో నార్సింగి(5), పటాన్‌చెర్వు (4),అమీన్‌పూర్ (5),మియాపూర్(6),శేరిలింగంపల్లి (6) ఉన్నాయి. అలాగే కుత్బుల్లాపూర్‌లో 7సర్కిళ్లు, 27వార్డులు ఉండగా అందులో చింతల్ (5), జీడిమెట్ల (4), కొంపల్లి (6), గాజులరామారం (4),నిజాంపేట్ (5),దుండిగల్ (4), మేడ్చల్ (3)ఉన్నాయి.

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్

(3జోన్లు -14సర్కిళ్లు -74వార్డులు)



మల్కాజ్‌గిరి, ఉప్పల్,ఎల్బీనగర్, జోన్లు కలిపి మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి)గా ఏర్పాటు చేయగా దీనికి వినయ్‌కృష్ణారెడ్డిని కమిషనర్‌గా నియమించారు. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే మల్కాజిగిరి, సికింద్రాబాద్ కంటోన్మెంట్, ఉప్పల్, ఎల్బీనగర్ శాసనసభ నియోజకవర్గాలు పూర్తిగా, మేడ్చల్, కూకట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాలు పాక్షికంగా కొంతవరకు వస్తున్నాయి.

సర్కిళ్లు..

మల్కాజ్‌గిరి జోన్‌లో 5సర్కిళ్లు 26వార్డులు ఉండగా అందులో కీసర (6), అల్వాల్ (6),బోయిన్‌పల్లి (5),మౌలాలి(5),మల్కాజ్‌గిరి (4) ఉన్నాయి. అలాగే ఉప్పల్‌జోన్‌లో 5సర్కిళ్లు 24వార్డులు ఉంటే అందులో ఘట్‌కేసర్ (4), కాప్రా (5),నాచారం(5), ఉప్పల్ (6),బోడుప్పల్ (4) ఉండగా..ఎల్బీనగర్ జోన్‌లో 4సర్కిళ్లు 24వార్డులు ఉన్నాయి. అందులో నాగోల్ (6),సరూర్‌నగర్ (7),ఎల్బీనగర్ (5),హయత్‌నగర్ (6)ఉన్నాయి.

డిగ్రీ, పాలిటెక్నిక్ విద్యార్థులకు పరిశ్రమల్లో శిక్షణ

- -నైపుణ్యాభివృద్ధి కోసం ఓయూలో ఉన్నత స్థాయి సమావేశం
- - సిలబస్‌లో మార్పులకు శ్రీకారం

మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, చిత్రంలో ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొ. బాలకిష్టారెడ్డి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, కమిషనర్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ దేవసేన, ఓయూ ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం తదితరులు

తార్నాక, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్, విశ్వవిద్యాలయాల విద్యార్థులకు ఉపాధి అవకాశాలు విస్తరించే దిశగా ఉన్నత విద్యాశాఖ కీలక చర్యలు ప్రారంభించింది. తరగతి గదుల విద్య మరియు పరిశ్రమల అవసరాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించేందుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం కేంద్రంగా బుధవారం ఐదు గంటల పాటు ఉన్నత స్థాయి మేధోమథనం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, కమిషనర్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ శ్రీదేవసేన ఐఏఎస్, ఓయూ ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం, వివిధ విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, ప్రిన్సిపాళ్లు, పరిశ్రమల ప్రతినిధులు హాజరయ్యారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష మేరకు ప్రతి విద్యార్థికి నైపుణ్యాధారిత శిక్షణ అందించాలనే లక్ష్యంతో సిలబస్‌లో మార్పులు చేపట్టాలని నిర్ణయించారు. విద్యార్థులు చదువు ప్రారంభించిన తొలి రోజు నుంచే పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్‌లు, ప్రాక్టికల్ శిక్షణ కల్పించేలా కార్యాచరణ రూపొందించనున్నారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ నైపుణ్యాలతో కూడిన విద్యే అసలైన విద్య అని పేర్కొనగా, యోగితా రాణా నైపుణ్యం తప్పనిసరి అంశమని స్పష్టం చేశారు. రానున్న విద్యాసంవత్సరం నుంచి ఫ్యూచర్ రెడ్డీ కోర్సుల్లో 4 వేల సీట్లు పెంచనున్నట్లు వెల్లడించారు. ఫార్మా, సెమీకండక్టర్, ఏవియేషన్, అగ్రికల్చర్ తదితర రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి మెరైన్ రంగంలోనే లక్షల ఉద్యోగావకాశాలు ఉన్నాయని వివరించగా, ఓయూ ఉపకులపతి కుమార్ మొలుగరం నైపుణ్యాధారిత విద్య అమలుకు విశ్వవిద్యాలయం సిద్ధంగా ఉందని తెలిపారు.సమావేశంలో పరిశ్రమల ప్రతినిధులు, సీఈవోలు విద్యా సంస్థలతో అవగాహన ఒప్పందాలకు ముందుకొచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 120 మంది ప్రిన్సిపాళ్లు, అధికారులు పాల్గొన్నారు.

ఆరేళ్లుగా మురుగు నీరే!

- -బయట నుంచి వచ్చే వ్యర్థ జలాలతో బోర్లు కలుషితం
- -దుర్వాసనతో కూడిన నీళ్లతో విషజ్వరాలు, చర్మవ్యాధులు
- -మొరపెట్టుకుంటున్నా పట్టించుకోని జలమండలి అధికారులు
- -కన్నీరు తెప్పిస్తున్న ట్యాంకరు ధరలు
- బృందావన్ కాలనీ వాసుల ఆందోళన

భూగర్భ జలాలు కలుషితంపై ఆవేదన వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

అత్తాపూర్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త : భూగర్భ జలాలు కలుషితం కాకుండా చూసుకో వాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో బృందావన్ కాలనీ వాసులకు శాపంగా మారింది. ఆరు సంవత్సరాలుగా భూగర్భ జలాల నుండి వచ్చే దుర్వాసన, మురుగు నీరుతో కాలనీ వాసులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన అధి కారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని బుద్వేల్ బృందావన్ కాలనీలో ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న మురుగు నీరు కాలనీలోని భూగర్భంలోకి చేరడంతో బోర్లు విషతుల్యమవుతున్నాయని తెలిపారు. దుర్వాస నతో కూడిన మురుగు నీరు వస్తుండటంతో ఆరేళ్లుగా 250 కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు రెయిన్ వాటర్ వెళ్లే లైన్‌లో సేవేరేజ్ వాటర్ లైన్లు కలిపి తమ బస్తివాస్తులకు నరకం చూపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనివల్ల డెంగ్యూ మలేరియా వంటి విష జ్వరాలతోపాటు చర్మ వ్యాధుల బారిన పడుతున్నామని వివరించారు. నీటి ట్యాంకర్ బుక్ చేస్తే ఐదు వందలు చొప్పున ఇవ్వాల్సి ఉండగా మరో వంద రూపాయలు డ్రైవర్ లంచం అడుగుతున్నాడని ఆరోపించారు. తాము టాక్స్‌లు చెల్లిస్తున్నా.. సరైన వసతులు కల్పించడంలో మున్సిపల్ ,జలమండలి అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కమి షనర్, రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ జలమం డలి అధికారులు తమ సమస్యకు పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

బోరులో దుర్వాసనతో వస్తున్న మురుగు నీరు

పరారీలో ప్రధాన సూత్రధారి

- - పథకం వేసింది.. అమలు పరిచింది అతనే..!
- - నేపాల్ నుంచి మత్తు బిల్లలు.
- - ఇద్దరి అరెస్ట్, రూ 1.3 కోట్ల వజ్రాభరణాలు స్వాధీనం

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త: పక్కాగా పథకం వేశాడు.. తాను అనుకున్నట్లుగానే శ్రీమంతుల ఇంట్లోకి తన మనిషిని పనిమనిషిగా ప్రవేశపెట్టాడు. యజమానులు లేనిది చూసి తన పథకాన్ని అమలు చేశాడు.. తన నేపాలి బృందంతో జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్‌లో దోపిడికి పాల్పడ్డాడు.. ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కేసును నగర పోలీసు కమిషనర్ సజ్జనార్ ఆధ్వర్యంలో సమర్ధంగా తిప్పి కొట్టారు.. ఊహించని రీతిలో నిందితులను అరెస్టు చేయడమే కాకుండా వారి వద్ద నుంచి చోరీకి పాల్పడిన వజ్రాభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే... ఈ నెల 5న జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్‌లో నివసించే వ్యాపారి రవీంద్రశర్మ నివాసంలో నేపాలి ముఠా చోరికి పాల్పడిన విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే రంగంలోకి దిగిన జూబ్లీహిల్స్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సమన్వయంతో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. విచారణలో భాగంగా ఈ చోరీ వెనుక ప్రధాన సూత్రధారి జిబన్ చంద్‌గా గుర్తించడమే కాకుండా అతనే దీనికి ప్రధాన సూత్రధారిగా తేల్చారు. జిబన్ సూచనల మేరకే రవీంద్ర శర్మ ఇంట్లోకి భూపేందర్ షాహి అలియాస్ భువన్(22) పనిమనిషగా ప్రవవేశించాడు. అక్కడ నమ్మకంగా వ్యవహరించి యజమానులు ఇంటి నుంచి బయటకు వెళ్లే సమాచారాన్ని జిబన్‌కు చేరవేశాడు. దీంతో నేపాల్ నుంచి ముందుగా తెచ్చి పెట్టుకున్న మత్తు మాత్రలను కూల్‌డ్రింక్‌లో కలిపి ఇంట్లో పనిచేసే ఇతర పనిమనుషులకు తాగించి వారు మత్తులోకి దిగిన తరువాత వారిని తాళ్లతో బంధించి అప్పటికే సిద్ధంగా ఉన్న తన నేపాలి ముఠా సభ్యులైన కృష్ణచంద్, రమేష్‌లతో కలిసి సుమారు రూ.1.3 కోట్ల విలువైన బంగారు, వజ్రాభరణాలను దొంగలించారు. 12 నిమిషాల్లోనే చోరిని ముగించి ముగ్గురు పారిపోయే క్రమంలో ఇంటి యజమానులు రావడంతో ముగ్గురిలో ఇద్దరు నిందితులు ఇంటి ముందు నుంచి రమేష్ ఇంటి వెనుక నుంచి పారిపోయారు. భువన్, కృష్ణ చంద్ లక్డీకపూల్‌కు వెళ్లి అక్కడి నుంచి బస్సులో పూణేకు, ముంబైకి వెళ్లారు. రమేష్ కూకట్‌పల్లికి పారిపోయాడు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు రమేష్‌ను కూకట్‌పల్లిలో అదుపులోకి తీసుకున్నారు. కాగా ముంబై నుంచి రైలులో వెళ్లిన ఇద్దరు నిందితులు పాట్నా రైల్వే స్టేషన్ కంటే ముందే దిగి బస్సులో ఇండో-నేపాల్ సరిహద్దుకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ మాటు వేసిన టాస్క్‌ఫోర్స్, జూబ్లీహిల్స్ పోలీసులు భువన్, కృష్ణచంద్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాగా భువన్‌ను పనిలో పెట్టిన మదన్‌ను, ముంబైలో వీరికి ఆశ్రయం కల్పించిన లలిత్, జనక్‌సాయిలపై కేసులు నమోదు చేశారు. జిబన్ చంద్ పథకం ప్రకారమే వీరంతా నడుచుకున్నారని, ప్రియురాలితో కలిసి జిబన్ బంజారాహిల్స్‌లోని నందినగర్‌లో నివసిస్తున్నట్లు గుర్తించారు. స్కెచ్ వేసిన జిబన్ కుమారుడు అనారోగ్యం బారిన పడటంతో సంఘటనకు అయిదు రోజుల ముందు నేపాల్ వెళ్లి అక్కడి నుంచి తన పథకాన్ని అమలు చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. 2021లో సైఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో రూ. 80 లక్షల చోరీ వ్యవహారంలో జిబన్ నిందితుడిగా ఉండటమే కాకుండా పరారీలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం జిబన్ పరారీలో ఉండగా మిగిలిన నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తుంది. పట్టుబడిన ఇద్దరిని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు.

అరెస్ట్ అయిన భువన్, కృష్ణచంద్.

రోడ్డు పక్కన చెత్త వేస్తే వాహనాలు సీజ్ చేస్తాం : డిసి సురేందర్‌రెడ్డి

- చెత్త వేసిన ఆటో యజమానికి రూ.10.వేల జరిమాన

నార్సింగి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఉన్న రోడ్ల పక్క చెత్తను డంప్ చేసే వాహనాలను సీజ్ చేస్తామని డిసి సురేందర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం హైదర్షాకోట్ డివిజన్‌లోని ఆర్మీ స్కూల్ ముందున్న రేడియల్ రోడ్డు పక్కన బండ్లగూడకు చెందిన హుస్సేన్ తన ఆటోలో చెత్తను, కుళ్లిపోయిన ఉల్లిగడ్డను తీసుకు వచ్చి పడవేశారు. అదే సమయంలో అటుగా వచ్చిన డిసి సురేందర్‌రెడ్డి ఆ ఆటోను ఆపివేయించారు. యజమానికి రూ.10.వేలు జరిమాన విధించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ ప్రజలందరూ తమ ఇళ్లతో పాటు పరిసరాల పరిశుభ్రతను కూడా కాపాడుకోవాలని సూచించారు. ఇంటిలో వెలువడే తడి,పొడి చెత్తలను వేరు చేసి ఇళ్ల ముందుకు వస్తున్న ఆటోల్లో వేయాలని సూచంచారు. ఇంట్లో వెలువడ్డ చెత్తను ఆటోల్లో కాకుండా ఇలా రోడ్ల పక్కన వేయడం నేరమని, మొదటి సారి పట్టుబడితే జరిమానాతో సరిపెడ్తామని, రెండో సారి పట్టుబడితే వాహనాలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలు, వాహనదారులు అందరూ రాజేంద్రనగర్ సర్కిల్‌ను స్వచ్ఛ సర్కిల్‌గా మార్చేందుకు మాకు సహకరించాలని డిసి సురేందర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు పక్కన చెత్త వేస్తున్న ఆటో యజమానికి రూ.10.వేల జరిమాన వేసిన రాజేంద్రనగర్ డిసి సురేందర్‌రెడ్డి.

ఆటో డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి

- ట్రాఫిక్ డిసిపి కాజల్

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త: ఆటో డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి భీమా తప్పనిసరిగా ఉండాలని జూబ్లీహిల్స్ జోన్ ట్రాఫిక్ డీసీపీ కాజల్ సూచించారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టుతో పాటు పలు ప్రాంతాల్లో బుధవారం ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగం రవీందర్‌లతో కలిసి ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. చాలా సందర్భాల్లో ప్రమాదం జరిగితే డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్సులు లేకపోవడం తద్వారా ఆర్థికం గా ఎంతో నష్టపోతున్నారన్నారు. అందుకే డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు ఆటోకు, వ్యక్తిగతంగా భీమా చేయించుకోవాలని సూచించారు. తద్వారా వాహనానికి ఎలాంటి ప్రమాదం జరిగినా, వ్యక్తిగతంగా ఎలాంటి నష్టం వాటిల్లినా ఆర్థికంగా ఎలాంటి సమస్య రాదని అన్నారు. దీనికితోడు ఆటోడ్రైవర్లు విధిగా నిబంధనలు పాటించాలని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకొని వెళ్లవద్దన్నారు. సూచించిన స్థానాల్లోనే ఆటోలను నిలపాలని ఏసీపీ కట్టా హరిప్రసాద్ తెలిపారు. తద్వారా ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడవని అన్నారు. ప్రతి ఠాణా ఇన్‌స్పెక్టర్ ట్రాఫిక్ నిబంధనలపై, డ్రైవింగ్ లైసెన్సులపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆటోలకే కాకుండా ప్రతి ఒక్క వాహనదారుడుకి డ్రైవింగ్ లైసెన్స్ తోపాటు వాహన భీమా ఉండాలని సూచించారు. అదనపు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న డీసీపీ కాజల్, చిత్రంలో ఏసీపీ కట్టా హరిప్రసాద్ తదితరులు.

జూబ్లీహిల్స్‌లో పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా

ఖానామెట్‌లో 5 ఎకరాల ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్

రూ. 1003 కోట్ల విలువైన ప్రభుత్వ భూమికి రక్షణ

హైదరాబాద్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త: జూబ్లీహిల్స్... అక్కడ గజం స్థలం రూ. 2 లక్షలు. అలాంటి ప్రాంతంలో పార్కును 150 గజాల మేర కబ్జా చేశాడో ప్రబుద్ధుడు. ఏకంగా రూ. 3 కోట్ల విలువైన భూమిని సొంతం చేసుకోవాలనుకున్నాడు. అలాగే హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌కు చేరువలోని ఖానామెట్ ప్రాంతం. అక్కడ ఎకరం రూ. 200ల కోట్లు. 5 ఎకరాలను వెలమ సంఘానికి గతంలో ప్రభుత్వం కేటాయించింది. ఈ భూమి విలువ రూ. 1000 కోట్లు ఉంటుందని అంచనా.. ఆ కేటాయింపులపై కొంతమంది అభ్యంతరం చెప్పడంతో కోర్టు స్టే ఇచ్చింది. ఇదే అదనుగా ఆక్రమణల పర్వానికి తెరదీశారు కబ్జారాయుళ్లు. ఈ రెండు కబ్జాలపై హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదులందాయి. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో హైడ్రా అధికారులు పరిశీలించారు. కబ్జాలను నిర్ధారించుకుని బుధవారం ఆక్రమణలను తొలగించి ఫెన్సింగ్ వేశారు. ఇలా మొత్తం రూ. 1003 కోట్ల ప్రభుత్వ ఆస్తిని హైడ్రా కాపాడింది.

కబ్జా చేసిన కిరాయిదారుడు..

జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రి ఔట్ గేట్‌కు ఎదురుగా ఇళ్ల మధ్య దాదాపు 2 ఎకరాల మేర పార్కు ఉంది. అక్కడ ఓ ఇంటిని కిరాయికి తీసుకుని లేడీస్ హాస్టల్ నడుపుతున్న వ్యక్తికి.. ఆ పార్కు స్థలంపై కన్ను పడింది. ఇంకేముంది 150 గజాల మేర పార్కును ఆక్రమించేశాడు. కాంపౌండ్ దాటి పార్కులోకి 50 గజాల మేర జరిగి పాత భవనానికి ఆనుకుని మరో నిర్మాణం చేపట్టాడు. ఒక్కో అంతస్తులో 4 బెడ్లు పట్టినట్టు గదులు నిర్మించాడు. ఇంటి యజమాని కూడా ఈ కబ్జాలపై మౌనంగా ఉన్నాడు. పార్కు వైపు గేటు పెట్టి 100 గజాల మేర ఫార్మ్ హౌస్ మాదిరి సొంత పార్కును అభివృద్ధి చేసుకుని వాడుకుంటున్నాడు. అక్కడ చుట్టుపక్కల నివాసితులు ఊరుకోలేదు. పార్కు కబ్జాపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ ఆదేశాల మేరకు జీహెచ్ ఎంసీ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో హైడ్రా పరిశీలించింది. పార్కులోకి 50 గజాల మేర జరిగి నిర్మాణం చేపట్టినట్టు నిర్ధారించుకుంది. మరో 100 గజాల మేర హద్దులు వేసుకుని ఆక్రమణ చేసినట్టు స్పష్టం చేసుకుంది. దీంతో బుధవారం 3 అంతస్తుల నిర్మాణాన్ని తొలగించారు. పార్కు కబ్జా ప్రయత్నాలకు ఫుల్ స్టాప్ పెట్టి ఫెన్సింగ్ వేశారు. కబ్జాకు పాల్పడ

మహాశివరాత్రికి వివేక్ నగర్ ఆంజనేయస్వామి సిద్ధం

వివరాలు వెల్లడిస్తున్న వివేక్ నగర్ ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్, కార్యనిర్వహణాధికారి మాచర్ల దేవనాదం

చిక్కడపల్లి ఫిబ్రవరి 11 (ప్రభాతవార్త) : మహాశివరాత్రి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని వివేక్ నగర్ ఆంజనేయస్వామి దేవస్థానములో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించబోతున్నట్లు ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్, కార్యనిర్వహణాధికారి మాచర్ల దేవనాదం బుధవారం వివరించారు. పదిహేనవ తేదీన ఉదయం ఆరు గంటలకు మహన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకములు, ఉదయం తొమిదిన్నర నుండి ఒంటిగంట ముప్పై వరకు ఏకవార రుద్రాభిషేకములు, సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి ఎనిమిదిన్నర ఏకవార రుద్రాభిషేకములు, రాత్రి పది గంటలకు సామూహికంగా మహన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకములు ఉంటాయని వివరించారు. రాత్రి ఒంటి గంటకు శివపార్వతుల కళ్యాణోత్సవం కన్నుల పండుగగా నిర్వహించబడుతుందన్నారు. భక్తులందరూ ఈ విశేష పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో ముఖ్య అర్చకులు బుగ్గా లక్ష్మీవతి శర్మ,ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫీజుల రీయంబర్స్‌మెంట్ చెల్లించాలి : జిల్లపల్లి అంజీ

సైఫాబాద్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: ఇంజనీరింగ్, ఎంబిఎ, ఎంసిఎ, పిజీ, డిగ్రీ కోర్సులు చేసే లక్షలాది మంది విద్యార్థులకు తక్షణమే 8 వేల కోట్ల ఫీజుల బకాయిల చెల్లించాలని బిసి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజీ డిమాండ్ చేశారు. కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు పై చదువులకు వెళ్ళాలంటే ప్రభుత్వం నుంచి ఫీజులు పెండింగ్‌లో ఉండటం వల్ల కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికేట్లు ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. దీంతో అనేక మంది విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే ప్రభుత్వం ఫీజుల రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేసి విద్యార్థులను అదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

14న 'తెలంగాణ జాతిపిత కెసిఆర్' అనే అంశంపై వ్యాస రచన పోటీలు

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గడ్డం శ్రీనివాస్‌యాదవ్

సైఫాబాద్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఈ నెల 14న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని బిఆర్ఎస్ నాయకుడు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను బుధవారం నిజాం కళాశాల ప్రాంగణంలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో కెసిఆర్ చేసిన పోరాట పటిమపై 'తెలంగాణ జాతిపిత కెసిఆర్' అనే అంశంపై పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలను గోషామహాల్ ని యోజకవర్గంతోపాటు నగరంలోని ప్రధానమైన స్కూల్స్, కాలేజీల లో ఈ పోటీలు 14న నిర్వహిస్తున్నామని, ప్రతి స్కూల్, కాలేజీలో ఉత్తమ వ్యాస రచనకు 5వేలు నగదు పురస్కారం అందజేస్తామన్నారు.

సుదీర్ఘ కార్మిక పోరాట పటిమ కలిగిన వ్యక్తి సుంకరి మల్లేశం

...హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ

సుంకరి మల్లేశంను సత్కరిస్తున్న హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ

చిక్కడపల్లి ఫిబ్రవరి 11 (ప్రభాతవార్త) : సుదీర్ఘ కార్మిక పోరాట పటిమ కలిగిన వ్యక్తి బీఎంఎస్ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన సుంకరి మల్లేశం అని హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. బుధవారం రాంనగర్ లో బండారు దత్తాత్రేయను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బి ఏం ఏస్ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికై న సుంకరి మల్లేశంను బండారు దత్తాత్రేయ సత్కరించి ప్రసంగిం చారు. మల్లేశం సుదీర్ఘ కార్మిక పోరాట పటిమను కొనియాడారు. తన వృత్తి జీవితాన్ని ఐడీపీఎల్ లో ప్రారంభించి, నాటి నుండి కార్మికుల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేశారు. బీఎంఎస్ లో వివిధ కీలక బాధ్యతలు చేపట్టి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా కార్మికోద్యమాన్ని బలోపేతం చేయడంలో ఆయన పోషించిన పాత్ర అమోఘం" అని పేర్కొన్నారు. సుంకరి మల్లేశం సారథ్యంలో భార తీయ మజ్దూర్ సంఘ్ దేశవ్యాప్తంగా మరింత బలోపేతం కావాలని, వారి పదవీకాలం దిగ్విజయంగా సాగాలని ఆకాక్షించారు.

రూ.32 కోట్లతో కాచిగూడ డివిజన్ అభివృద్ధి

: మాజీ కార్పొరేటర్ ఉమా రమేష్ యాదవ్



మీడియాతో మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ ఉమా రమేష్ యాదవ్

కాచిగూడ, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త

గత ఐదు సంవత్సరాల కార్పొరేటర్ పాలనలో కాచిగూడ డివిజన్ లో రూ.32 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు బీజేపీ డివిజన్ మాజీ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ బుధవారం మీడియా సమావేశంలో తెలిపారు. నింబోలి అడ్డలోని బీజేపీ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఆమె డివిజన్ అభివృద్ధి కోసం మరో రూ.5 కోట్ల ప్రాజెక్ట్ ప్రతిపాదనలు అధికారులకు, ప్రభుత్వానికి పంపామని పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని నారాయణగూడ చౌరస్తాలో మోడల్ మార్కెట్ నిర్మాణం పూర్తయిందని, త్వరలోనే మార్కెట్ ప్రారంభించి ప్రజలకు, వ్యాపారులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆమె అధికారులను కోరారు. బీజేపీ సికింద్రాబాద్ ఎంపీ, కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలోరు వెంకటేష్, వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, సిబ్బందితో కలిసి డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరుగుతోందని చెప్పారు. ప్రజలకు ముఖ్యంగా సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, మంచినీటి, డ్రైనేజీ, వర్షపునీటి పైపులైన్ల నిర్మాణం, అవసరమైన చోట్ల పవర్ బోర్లు ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఐదు సంవత్సరాలుగా తనకు సహకరించిన ప్రజలకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవలు అందించే అవకాశం ప్రజలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సుభాష్ పటేల్, కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు తంగెడిపల్లి బల్వీర్, ప్రధాన కార్యదర్శి ఆర్. సంతోష్, శ్రీరాం సాయికుమార్, వాసు, బి.భీమారాజ్, ఎస్.రవియాదవ్, ఎస్.అరవింద్, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

చేయి తడిపితేనే ఫైలు కదలిక..!

-అవినీతికి కేరాఫ్ కూకట్‌పల్లి జోన్ సిటీ ప్లానర్ కార్యాలయం..

-నిర్మాణాలకు అనుమతులు, ఆక్యూపెన్సీకి రూ.లక్షల్లో మామూళ్ళు..

కూకట్‌పల్లి జోన్ ప్రతినిధి, జనవరి11ప్రభాతవవార్త: కూకట్‌పల్లి జోన్ సిటీ ప్లానర్ కార్యాలయం అవినీతికి , అక్రమార్జనకు నిలయంగా మారింది. ఇక్కడ కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్న ఓ అధికారి అవినీతికి కేరాప్ అడ్రస్‌గా మారారు. రూ. లక్షలు ఖర్చుపెట్టి ఇక్కడ సీటు దక్కించుకున్న సదరు అధికారి వడ్డీతో సహా సంపాదించడమే లక్ష్యంగా పెట్టుకుని అక్రమార్జనలో కొత్త పుంతలు తొక్కుతూ రూ.కోట్ల మామూళ్ళను తన జేబుల్లో వేసుకుంటున్నట్లు ఆరోపణలు వున్నాయి. అక్రమాలతో రూ.కోట్ల ఆస్తులల్ని కూడబెట్టుకున్న సదరు అధికారికి మామూళ్ళపై మక్కువతో పదవి ఉండగానే రూ.కోట్లు సంపాదించాలనే ప్లాన్‌లో ఉన్న సదరు అధికారి నిర్మాణ అనుమతులకు ఓ రేటు ఆక్యూపెన్సీ పత్రాల జారీకి మరో రేటు వెలకట్టి అక్రమంగా సంపాదిస్తూ తన జేబుల్లో వేసుకుంటున్నట్లు సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. బహుళంతస్తుల భవన నిర్మాణాల అనుమతులను సకాలంలో ఇవ్వకపోవడంతో దరఖాస్తుదారులు సిటీ ప్లానర్ కార్యాలయం చుట్టూ తమ కాళ్ళ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి భవన నిర్మాణల అనుమతికి అన్ని పత్రాలు సక్రమంగా ఉంటే నిర్ణీత వ్యవధిలో అనుమతులు ఇవ్వాలి. కాని ఇదంతా కాగితాలు, ప్రకటనలకే పరిమితం. అడిగినన్నీ మామూళ్ళు ఇవ్వకుంటే అనుమతులు రాని పరిస్థితి ఇక్కడ నెలకొంది. నిర్మాణ అనుమతులకు పెద్ద మొత్తంలో మామూళ్ళను డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. గత కొంత కాలంగా నిర్మాణ అనుమతుల్లో విపరీతమైన జాప్యానికి ఇదే కారణం స్పష్టమవుతోం ది. నిర్దేశిత రుసుము చెల్లిస్తారు. సాధారణంగా ఇవన్నీ సక్రమంగానే ఉంటాయి. కాబట్టి నిర్ణీత గడువులోగా భవన నిర్మాణ అనుమతులు ఇవ్వాలి. ఓ అధికారి నిర్మాణ అనుమతుల్లో తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అన్నీ పత్రాలు సక్రమంగానే ఉన్నప్పటికీ అనుమతి ఎందుకు ఇవ్వడంలేదని దరఖాస్తుదారులు ప్రశ్నిస్తున్నారు. ఎందుకు పర్మిషన్ ఇవ్వడంలేదని సదరు అధికారితోపాటు కార్యాలయ సిబ్బందిని ప్రశ్నిస్తే ఏదో ఒకటి కొర్రీ చూపుతూ బ్రోకర్ల సాయంతో దరఖాస్తు దారుల నుంచి లక్షల్లో మామూళ్ళను వసూళ్ళు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

జోనల్ కార్యాలయం

ఒక్కో భవనానికి రూ.20లక్షలకు పైగానే..

ఈ కార్యాలయంలో మామూళ్ళ రేట్లు..

అక్రమ వసూళ్ళలో కొత్త రికార్డులు సృష్టిస్తోన్న కూకట్‌పల్లి జోన్ సిటీ ప్లానర్ కార్యాలయంపై అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ), విజిలెన్స్ విభాగాల నిఘా పెంచినా అవినీతి ఏ మాత్రం తగ్గకపోగా రోజు రోజుకు పెరుగుతోంది. కూకట్‌పల్లి, మాదాపూర్, కెపిహెచ్‌బికాలనీ, బాలాజీనగర్, హైదర్‌నగర్, వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ డివిజన్లలోని పలు ప్రాంతాల్లో నగరానికి ఢీటుగా ఇక్కడి స్థలాలకు డిమాండ్ పెరుగడంతో బహుళంతస్తుల భవనాలు, కమర్షియల్ భవనాలు కుప్పలు తెప్పలుగా వెలుస్తున్నాయి. పెద్ద ఎత్తున బహుళంతస్తుల భవనాలు కొందరు అధికారులకు రూ.కోట్లు కురిపిస్తున్నాయి. ఇళ్ళ నిర్మాణంలో నిబంధనలల్ని పాటించడంలేదని సామాన్య మధ్య తరగతి ప్రజల్ని ముప్పుతిప్పలు పెట్టే అధికారులు నిబంధనల్ని పాటించని అనేక మంది బిల్డర్ల బహుళంతస్తుల భవనాల్ని నిర్మిస్తున్నా అదే విధంగా నిబంధనల్ని తుంగలో తొక్కి భవన నిర్మాణం పూర్తయిన భవనాలకు ఆక్యూపెన్సీ పత్రాలను జారీ చేస్తూ ఓ అధికారి రెండు చేతులా ఆర్జిస్తున్నాడన్న విమర్శలు పెరిగిపోయాయి. బహుళ అంతస్తుల భవనాల అనుమతులతోపాటు ఆక్యూపెన్సీ సర్టిఫికెట్ల జారీకి ఒక్కో భవనానికి రూ.20 లక్షల నుంచి 30 లక్షలకు పైగానే ముడుపులు తీసుకుంటున్నట్లు సదరు అధికారిపై పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి.

విఖ్యాత గాయకుడు ఘంటసాలకు గిఫ్ట్ స్వర నివాళి

గాయని గాయకులను సత్కరిస్తున్న వంశీ సంస్థల అధినేత డాక్టర్ వంశీ రామరాజు

చిక్కడపల్లి ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : విఖ్యాత గాయకుడు ఘంటసాల 52 వ వర్ధంతి సందర్భం గా వంశీ సంస్థల ఘంటసాల ఇంటర్నేషనల్ ట్రస్ట్ (గిఫ్ట్) నిర్వాహణలో నాలుగు వేదికలు శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక తో పాటు కళా మారుతి కళా వేదిక, గుండవరపు హనుమంత కళా వేదిక కళా దీక్షితులు కళా వేదిక పై నలభై రెండు మంది ప్రముఖ వర్ధమాన ప్రవర్ధమాన గాయనీ గాయకులు పద్దెనిమిది గంటల పాటు తమ గానం తో స్వర నివాళి అర్పించారు. వీరిలో వై ఎస్ రామకృష్ణ బృందం వి ఆర్ కె ఫణి బృందం రామ్ కుమార్ బృందం జ్యోతిర్మయి బోమ్ము బృందం అలనాటి నాటి ఘంటసాల సోలో పాటల్తో పాటు ఇతర గాయనీ గాయకుల తో పాటు పాడిన పాటలు మధురం గా ఆలపించారు. చంద్ర శేఖర్ వై (అమెరికా) గంటి రామ కృష్ణ కె వి రావు శారదా రెడ్డి కమలశాస్త్రి, రేణుకా రమేష్ స్వర కళ్యాణి రామ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భం గా వంశీ సంస్థల అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు మాట్లాడుతూ అమెరికాలో పదునాలుగు సార్లు ఘంటసాల ఆరాధనోత్సవాలు నిర్వహించాము అని చెప్పారు తెలుగు విశ్వవిద్యాలయం లో ఘంటసాల వంశీ స్వర్ణ పతకం ఏర్పాటు చేసి ప్రతి ఏటా సంగీతం లో ప్రథమ శ్రేణి విద్యార్థికి స్వర్ణ పతకం బహుకరణ జరుగుతోంది అని తెలిపారు సుధామయి వ్యాఖ్యానం చేసిన కార్యక్రమం కు వంశీ మేనేజింగ్ ట్రస్ట్ సుంకర పల్లి శైలజ పర్యవేక్షణ చేశారు ఈ సందర్భంగా కుంట్లూర్ లోని వంశీ వేగ్నేష ఆశ్రమం లో వున్న ఘంటసాల దేవాలయం లో పూజలు నిర్వహించారు

సాహిత్యమే సమాజానికి చైతన్య స్ఫూర్తి : జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త

సాహిత్యమే సమాజ చైతన్య స్ఫూర్తియని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. శేరిలింగంపల్లి రచయితల సంఘం ఆధ్వర్యంలో చందానగర్‌లోని సరస్వతి విద్యామందిర్‌లో శేరసం ద్వితీయ వార్షికోత్సవం, కవిసమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర గనుల శాఖ విశ్రాంత డైరెక్టర్ డాక్టర్ వి.డి. రాజగోపాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ హాజరై ప్రసంగించారు. సమజాన్ని చైతన్యవంతం చేయటంలో కవుల పాత్ర కీలకమైనదని అన్నారు. జ్ఞానపీఠ్‌అవార్డు గ్రహీతలైన విశ్వనాథ సత్యనారాయణ, సి.నారాయణరెడ్డి, రావూరి భరద్వాజ్ వంటి ప్రముఖులు నేటి కవులకు ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. ఆస్తులు కూడబెట్టినా రాని మానసిక ప్రశాంతత సాహిత్య గ్రంథ పఠనం ద్వారా సిద్ధిస్తుందన్నారు. తెలియని సంగతులను అక్షరం నేర్పిస్తుందని ఆయన అన్నారు. శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని కవులు, కళాకారులను ఒక వేదికపైకి తీసుకువచ్చి తెలుగు భాషా, సాహిత్యాల మనుగడకు కృషిచేస్తున్న శేరిలింగంపల్లి రచయితల సంఘం నిర్వాహకులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. అనంతరం రాష్ట్ర గనుల శాఖ విశ్రాంత డెరెక్టర్ వీ.డీ. రాజగోపాల్,ప్రముఖ కవి, విమర్శకులు గంటా మనోహర్‌రెడ్డి, రామకృష్ణ చంద్రమౌళి, అంజనీకుమారి,

శేరసం ఆద్వర్యంలో కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న జగదీశ్వర్‌గౌడ్, పాల్గొన్న సాహితీవేత్తలు

రామస్వామియాదవ్‌లు మాట్లాడారు. మనిషిని కదలించేది,నడిపించేది కవిత్వమేనన్నారు. కవులు అనాధికర శాసనకర్తలని వారు అభివర్ణించారు. ఈ సందర్భంగా ఇస్లామిక్ సాహిత్య వేదిక ప్రతినిధి అబ్దుల్ రషీద్ సంకలన కర్తగా ప్రచురించిన కవితా సంకలనాన్ని ఆవిష్కరించారు. ఈ సభా కార్యక్రమానికి శేరిలింగంపల్లి రచయితల సంఘం అధ్యక్షులు మోటూరి నారాయణరావు సమన్వయ కర్తగావ్యవహరించగా, శేరసం ఉపాధ్యక్షులు జేవీ కుమార్ చేపూరి, ప్రధాన కార్యదర్శి రవీందర్‌బాబు అరవా,భీమా శ్రీనివాస్ రావు, విశ్వనాథ రెడ్డి , చంద్రశేఖర్ రావులు కవిసమ్మేళన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలోసీనియర్ కాంగ్రెస్ నాయకులు సునీతరెడ్డి, ప్రీతం, కట్ల చంద్రశేఖర్‌రెడ్డి, శేఖర్ ముదిరాజ్,కవులు డాక్టర్ రమ్య స్వరూప్,కొలచన విజయభారతి పాల్గొన్నారు.

గాంధీనగర్ డివిజన్ సమగ్రాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం : పావని వినయ్ కుమార్

చిక్కడపల్లి ఫిబ్రవరి 11 (ప్రభాతవార్త) : అధికారికంగా 5 సంవత్సరాల కార్పొరేటర్ పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న ఎ. పావని వినయ్ కుమార్ ను స్థానిక బుధవారం వారి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. బిజెపి సీనియర్ నాయకులు రత్న సాయి చంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డివిజన్ బిజెపి సీనియర్ నాయకులు పాల్గొని అభినందనలు తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గంలోని గాంధీనగర్ డివిజన్‌ను అభివృద్ధి పథంలో అగ్రస్థానంలో నిలిపేందుకు కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ చేసిన కృషిని నాయకులు ప్రశంసించారు. ప్రజ ల సమస్యల పరిష్కారంలో ఆమె చూపిన చిత్తశుద్ధి, పట్టుదల అభినందనీయమని పేర్కొన్నారు. డివిజన్ అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో

గాంధీనగర్ తాజా మాజీ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ ను సత్కరించిన దృశ్యం

ఆమె చేసిన సేవలు విశేషమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్ గారు, డివిజన్ అధ్యక్షుడు వి. నవీన్ కుమార్ గారు, నాయకులు శ్రీకాంత్, దామోదర్, ఎం. ఉమేష్, సత్తి రెడ్డి, ప్రకాష్ యాదవ్, సురేష్ రాజు, ఆనంద్ రావు, శ్రీనివాస్ యాదవ్, సాయి కుమార్, నీరజ్ తదితరులు పాల్గొన్నారు.

దేశ సమగ్రాభివృద్ధికి మార్గదర్శకుడు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ : బండారు దత్తాత్రేయ

ముషీరాబాద్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త: దేశ సమగ్రాభివృద్ధికి మార్గదర్శకుడు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ అని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కొనియాడారు. బుధవారం దీన్ దయాళ్ ఉపాధ్యాయ 58వ వర్ధంతి సందర్భంగా గోల్నాకలోని ఆరవ నెంబర్ క్రాస్‌రోడ్సులో శ్రీ భవాని వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ప్రధాన కార్యదర్శి మూల రవీందర్‌గౌడ్ నేతృత్వంలో సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా దత్తాత్రేయ హాజరై ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం దత్తాత్రేయ మాట్లాడుతూ పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయజీ నిజమైన జాతీయవాది అన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను ఆధారంగా చేసుకుని దేశ నిర్మాణానికి అవసరమైన దిశను చూపించిన మహత్తర తాత్వికుడు అని కొనియాడారు. ఏకాత్మ మానవతా సిద్ధాంతాన్ని ప్రతిపాదించి, వ్యక్తి-సమాజం-రాష్ట్రం పరస్పర అనుసంధానంతో ముందుకు సాగాలనే ఆదర్శాన్ని దేశానికి అందించారని గుర్తు చేశారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయజీ మహత్తర సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కర్రి రవీందర్, ఎం.అరుణ్‌కుమార్, ఏ.బసవరాజ్, ఏ.ఉపేంద్ర, ఎం.సత్యనారాయణ, కే.స్వామి, జి.వంశీకృష్ణ, సీహెచ్.వేణుగోపాల్, ఎం.స్వప్నప్రియ, శ్రీనివాస్, కొండ రవి, కే.కృష్ణ బీజేపీ నాయకులు శ్రీధర్‌గౌడ్, కేసరి నరినసంగరావుయాదవ్, ఈ.అజయ్‌కుమార్, ఎం.శ్యాంరాజు, కే.రమేష్‌యాదవ్, వనం రమేష్, జగన్, నాగరాజుచారి, ధనుంజయ, ఈశ్వర్‌రావు, టి.రాము, సావిత్రి గోపాల్, బద్రి తదితరులు పాల్గొన్నారు.

పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

కృష్ణా నదిలో ఈదిన చిన్నారులను అభినందించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ సర్కిల్ కిస్మత్‌పూర్ డివిజన్‌కు చెందిన ఇద్దరు పదేళ్లలోపు చిన్నారులు కృష్ణానది క్రాసింగ్‌లో 1.5.కిలో మీటర్ల దూరం ఇది అందరిచేత శభాష్ అనిపించుకుంటున్నారు. బుధవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆ చిన్నారులు విధీసింగ్(8), యువాన్ మెహతా(10)లను అభినందించి, భవిష్యత్తులో ఈత పోటీల్లో పాల్గొని మరిన్ని విజయాలు సాధించాలని, మన ప్రాంతానికి మంచి కీర్తి,ప్రతిష్టలు తీసుకు రావాలని ఆశీర్వదించారు. తల్లిదండ్రులు తమ బిడ్డలను పుస్తకాల పురుగుల్లా మార్చవద్దని, చదువులతో పాటు వారికి ఇష్టమైన ఆటలను గుర్తించి, శిక్షణ ఇప్పించి ప్రోత్సహించాలని సూచించారు. ఒక్కొక్కరిలో ఒక్కో రకమైన ప్రతిభ ఉంటుందని, దాన్ని వెలికి తీసి సానబెడితే అద్భుతమైన ఫలితాలు వస్తాయన్నారు. పదేళ్ల లోపు చిన్నారులు కోచ్ ఆనంద రాయుడు సమక్షంలో చాలా ధైర్యంతో కృష్ణా నదిలో ఈదారని తెలిపారు. ఈ చిన్నారులు మునుముందు స్విమ్మింగ్‌లో గొప్ప క్రీడాకారులుగా ఎదుగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, నాయకులు గోకరి సురేష్‌గౌడ్, క్యాతం పాపయ్య యాదవ్, రజాక్, సాధిక్, నదీం తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా నది క్రాసింగ్‌లో 1.5.కి.మీ.ల దూరం ఈదిన చిన్నారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

పదవుల కోసం ప్రజలను మోసం చేయటం తగునా : మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి

శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త

బీఆర్ఎస్ పార్టీ టికెట్‌పై గెలిచి పదవులు అనుభవించి అధికారం మారగానే నైతికవిలువలు వదలి నమ్ముకున్న ప్రజలను మోసం చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని బీఆర్ఎస్ శేరిలింగంపల్లి నియోజకవర్గ నేత, చందానగర్ మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి ధ్వజమెత్తారు. శేరిలింగంపల్లి నియోజక వర్గ బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో చందానగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ప్రజాస్వామ్యానికి పునాదైన భారత రాజ్యాంగాన్ని అవహాస్యం చేస్తూ గెలిపించిన ప్రజలకు, పార్టీకి వెన్నుపోటు పొడిచిన కార్పొరేటర్లకు జ్ఞానోదయం కలగాలని కోరుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వినూత్న రీతిలో నిరసన తెలిపారు. రాజ్యాంగం రాసిన అంబేద్కరుని సాక్షిగా రాజ్యాంగ స్ఫూర్తి చంపేసిన ఫిరాయింపు దారులను ప్రజలు రాబోయే ఎన్నికలలో ఓటుద్వారా శిక్షించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకురాలు నవతారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ టికెట్‌పై గెలిచి రెండేళ్లు పదవిని అనుభవించి, అధికారం మారగానే నైతిక విలువలను వదిలేసి కాంగ్రెస్ గూటికి చేరటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ పార్టీ ఫిరాయింపుల నిరోదక చటాన్ని తుంగలో తొక్కారన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యే, కార్పొరేటర్లు తమ పదవులకు రాజీనామా చేయకుండా పార్టీ ఫిరాయిచటమంటే పరోక్షంగా రాజ్యాంగాన్ని అవమానించటమే అవుతుందన్నారు. స్వలాభం కోసం జంపింగ్‌లు జరిగాయని, ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారన్నారు. నేటితో కార్పొరేటర్ల పదవీకాలం ముగిసిందని, రేపటి నుంచి కార్పొరేటర్లు మాజీలేనని, మళ్లీ ఓట్లు అడగటానికి ఏముఖం పెట్టుకుని ప్రజల వద్దకు వెళతారని దుయ్యబట్టారు. రాజ్యాంగానికి విరుద్ధంగా ప్రవర్తించిన మాజీలకు రాబోయే కార్పొరేషన్ ఎన్నికలల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. అధికారం శాశ్వతం కాదని, నమ్ముకున్న సిద్ధాంతం, నిలబడ్డ విలువలెప్పుడూ చరిత్రలో నిలిచిపోతాయని, ఫిరాయింపు ప్రజాప్రతినిధులు చరిత్రహీనులుగా మిగిలిపోతారని స్థానికనాకులు ఎద్దేవ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో శ్రీనివాస్ సేవలు ఎనలేనివి : ఎమ్మెల్యే శ్రీగణేష్

కాంగ్రెస్ నేత శ్రీనివాస్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

కంటోన్మెంట్,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గంలో అడ్ల శ్రీనివాస్ సేవలు మరువలేనివని ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. తుకారాంగేట్ ప్రాంతానికి చెందిన అఖిల శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. గురువారం ఆయన నివాసం వద్ద ఏర్పాటు చేసిన సంతాప సభలో పాల్గొని కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

నాణ్యమైన విద్య అందించే సంస్థలకు ప్రోత్సాహం : పద్మారావు గౌడ్

విద్యార్థులతో ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: పిల్లలకు నాణ్యమైన విద్యను అందించే విద్య సంస్థలను తగిన విధంగా ప్రోత్సహిస్తామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సితఫల్‌మండీలోని శ్రీ సాయి విద్యాలయం వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం సితఫల్‌మండీ ఎం.ఎల్.ఏ. క్యాంపు కార్యాలయం వద్ద ప్రతిభావంతులైన విద్యార్థులకు అవార్డుల ప్రధానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో పద్మారావు గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 39 సంవత్సరాలుగా సికింద్రాబాద్ విద్యార్థులకు సాయి విద్యాలయం గ్రూపు సంస్థలు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

డ్రైవర్‌ల బంద్‌ను విజయవంతం చేయండి : ఎఐటియూసి

గోడ పత్రికను విడుదల చేస్తున్న నాయకులు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: ఆటో, క్యాబ్, ట్యాక్సీ, లారీ డ్రైవర్‌ల సమస్యల పరిష్కారం కోసం గురువారం జరుపనున్న బంద్‌ను విజయవతం చేయాలని కోరుతూ ఏఐటీయూసీ ఆటో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహ్మద్ ఉమర్‌ఖాన్ ఆద్వర్యంలో సీతాఫల్‌మండి చౌరస్తా వద్ద గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ డ్రైవర్‌ల జీవితాలు ఇబ్బందికరంగా మారాయని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలుపుకోవాలని కోరారు. అందరూ డ్రైవర్‌లు విధిగా బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో నగరమాజీ అధ్యక్షుడు కొమరవెల్లి బాబు, లతీఫ్, రాములు, హరి,దర్శన్,లడ్డు, సురేష్,లక్ష్మణ్, కిషన్ పాల్గొన్నారు.

ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండా గుండె వాల్వ్ చికిత్స

కంటోన్మెంట్,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: వృద్ధాప్యంలో గుండె ఆపరేషన్ అంటే ప్రమాదం అనే భయాన్ని చెదరగొట్టేందుకు గుండె వాల్వ్ చికిత్సతో నయం చేయవచ్చని మెడికవర్ ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ ప్రమోద్ కుమార్ కంచులకంటి, డాక్టర్ సాగర్ చంద్రశేఖర్, భుయార్‌లు తెలిపారు. బుధవారం సికింద్రాబాద్‌సంగీత్ చౌరస్తాలోని మెడికవర్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 75 సంవత్సరాల వృద్ధురాలికి ఓపెన్ హార్ట్ సర్జరీ లేకుండా గుండెవాల్వ్ చికిత్సతో నయం చేయవచ్చన్నారు. ఆ రోగి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఓపెన్ హార్ట్ సర్జరీ ప్రమాదకరమని భావించి గుండెవాల్వ్ చికిత్సచేయించడం జరిగిందన్నారు. వృద్ధుల్లో కనిపించే ఆయాసం, అలసటను వయసు కారణంగా భావించకూడదన్నారు. సకాలంలో పరీక్షలు చేయించుకుంటే ఓపెన్ హార్ట్ సర్జరీ లేకుండానే ఆధునీక పద్ధతుల్లో వాల్వ్ చికిత్సతో నయం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్.శివప్రసాద్ నాయుడు, డాక్టర్ అమరేంద్ర కుమార్ సింగ్, డాక్టర్ వరుణ్ గౌతమ్, డాక్టర్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

జిహెచ్‌ఎంసి విభజన నిర్ణయం పనికిమాలిన చర్య : ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్

పేట్ బషీరాబాద్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త

జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పూర్తిగా అనాలోచిత చర్య అని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కె.పి. వివేకానంద్ విమర్శించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రభుత్వ విధానాలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం 12 సంవత్సరాల పాటు ఎన్నికలు నిర్వహిస్తూ పాలనను సౌకర్యవంతంగా అమలు చేసిందని గుర్తుచేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాలనలో వైఫల్యం కారణంగా హైదరాబాద్ నగరాన్ని కమిషనరేట్లు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లుగా విభజిస్తూ ముక్కలు చేసి పాలించాలని చూస్తోందని ఆరోపించారు. ప్రజలకు, ప్రజాప్రతినిధులకు తెలియకుండా రహస్యంగా నిర్ణయాలు తీసుకుంటోందని, స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తూ రాచరిక పాలన కొనసాగుతోందని ఆయన విమర్శించారు. స్థానిక సమస్యలను పరిగణనలోకి తీసుకుని, ప్రజల అభిప్రాయాలు తెలుసుకుని నిర్ణయాలు తీసుకోవాల్సింది పోయి ఏకపక్షంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికలను వాయిదా వేస్తూ స్పెషల్ ఆఫీసర్ల పేరుతో నగరాన్ని దోచుకునే ప్రయత్నం జరుగుతోందని తీవ్రంగా ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రానికి గ్రేటర్ హైదరాబాద్ గుండెకాయ వంటిదని, అలాంటి నగరాన్ని విభజించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి పునరాలోచన చేసి కార్పొరేషన్ల అంశంపై సరైన నిర్ణయం తీసుకోవాలని, లేదంటే న్యాయ పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద

చాపెల్ రోడ్డులో చైన్‌స్నాచింగ్

గన్‌ఫౌండ్రి,ఫిబ్రవరి 11ప్రభాతవార్త: నడుచుకుంటు వెళ్తున్న ఓ మహిళా మెడలో నుంచి బంగారు లాక్కుని (చైన్‌స్నాచింగ్)పాల్పడిన సంఘటన బుధవారం ఉదయం అబిడ్స్‌పోలీస్‌స్టేషన్ పరిధిలోచోటు చేసుకుంది.ఇన్‌స్పెక్టర్ పరుశురాం కథనం ప్రకారం... ప్రాంతానికి చెందిన నర్సుగా విధులనునిర్వహిస్తున్న శ్రీష(24) చాపెల్‌రోడ్డులో నడుచుకుంటు వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కుని పారిపోయారు.బాధితులుఅబిడ్స్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది.ఈ విషయం నగర పోలీసు కమీషనర్ వి.సి సజ్జనార్ ఆదేశాల మేరకు అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ పరుశురాం తన సిబ్బందితో కలిసి బాధితురాలి ఇంటికి చేరుకుని304 బిఎన్ఎస్ కేసు నమోదు చేసిన(ఎఫ్.ఐ.ఆర్)ను అందచేశా రు.ఈ కేసునుఅబిడ్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మొట్ట మొదటిసారిగా నగర పోలీస్ కమీషనరేట్ పరిధిలోబాధితురాలి ఇంటికి వెళ్లి కేసు నమోదు చేసిన ఎఫ్.ఐ. ఆర్ అందచేయడం పట్ల పలువురు చర్చించుకోవడం జరుగుతుంది.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన వడ్డేపల్లి

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త : చేవెళ్ల మున్సిపాలిటీలో పోలింగ్ జరుగుతున్న సందర్భంగా చేవెళ్ల మున్సిపాలిటీ బీజేపీ ఎన్నికల ఇంచార్జ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు పూర్తిగా స్వేచ్ఛాయుతంగా, న్యాయంగా, శాంతియుత వాతావరణంలో జరగాలని అధికారులను కోరారు. అలాగే బీజేపీ పోలింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండి, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు, పోలింగ్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన వడ్డేపలి

జీడిమెట్ల సర్కిల్ బిల్ కలెక్టర్‌పై జోనల్ కమిషనర్ వేటు

-ఆకస్మిక తనిఖీతో ట్రేడ్‌లైసెన్స్ లేని భవనం గుర్తింపు

- బెంబేలెత్తుతున్న ఉద్యోగులు

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి11 ప్రభాతవార్త కుత్బుల్లాపూర్ జోనల్ వ్యవస్థ ఉద్యోగుల పాలిటశాపంగా పరిణమించిందనే భయాందోళన మొదలైంది. ఇప్పటివరకు ఉన్న డిప్యుటీకమిషనర్ స్థాయి అధికారి నేతృత్వంలో నిర్వహించే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కొత్తగా 150మంది కార్పోరేటర్ల వ్యవస్థనుండి 300 స్థానాలకు పెంచి సర్కిల్ వ్యవస్థనుండి నోనల్ వ్యవస్థగా రూపొందించడం తోపాటు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిజాంపేట్, దుండిగల్ గండిమైసమ్మ, కొంపల్లి, చింతల్, జీడిమెట్ల, గాజులరామారంలను సర్కిల్ కార్యాలయాలుగా రూపొందించారు.. నూతనంగా జోనల్ మిషనర్‌గా నియమితులైన సందీప్‌కుమార్ ఝా తన పరిధిలోని ఏడు మున్సిపల్ సర్కిళ్లలో నిరంతర పర్యవేక్షణచేస్తూ సిబ్బందికి పరుగుపెట్టిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని చింతల్‌లో రోజువారీ తనిఖీలలో భాగంగా ట్రేడ్‌లైసెన్స్‌ల విభాగంలో భాగంగా తనిఖీలు నిర్వహిస్తూ చింతల్ ప్రదాన రహదారిపైగల ఓ భవనంవద్ద వాహనం నిలిపి ఇంటియజమానికి ట్రేడ్‌లైసెన్స్‌కు సంబందించిన వివరాలు అడిగారు. దీనికి షాపుయజమాని నోరెళ్లబెట్టి అసలు ట్రేడ్ లైసెన్స్ అంటే ఏమిటని ప్రశ్నించడంతో ఖంగుతినడం అధికారుల వంతైనట్లు సమాచారం. వెంటనే పక్కనే ఉన్న జీడిమెట్ల డిప్యుటీకమిషనర్‌లకు సంబందిత పన్నుల విభాగం సిబ్బంది ఎవరనేది తెలుసుకుని వెంటనే తగు చర్యలకు ఆదేశాలు జారీచేసినట్లు తెలిసింది. దీనితో సర్కిల్ పరిధిలోని వివిధ విబాగాల సిబ్బంది భయాందోళనలకు గురవుతున్నట్లు సమాచారం. తన పరిధిలోని ఏడు సర్కిళ్ల పరిధిలో సానిటేషన్, టాక్స్, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాల పనితీరులపై ప్రత్యేకదృష్టి సారిస్తున్నతీరు వివిధ విభాగాల అధికారులతోపాటు సిబ్బందిపై కూడా ప్రభావం చూపుతుంద పుకార్లు శికారు చేస్తున్నాయి. ఉద్యోగులు గడగడలాడుతున్నారనే సమాచారం. ఏవిధంగా చర్యలకు పురమాయిస్తారో తెలియక సిబ్బంది, అధికారులు అయోమయానికి, ఆందోళనకు గురవుతున్నారనే పుకార్లు శికారు చేస్తున్నాయి.

అమ్మ వారి ఆశీర్వాదంతో రాంగోపాల్‌పేట డివిజన్‌ను ఎంతో అభివృద్ధి చేసా : సుచిత్ర శ్రీకాంత్

బేగంపేట ఫిబ్రవరి 11,ప్రభాతవార్త : అమ్మ వారి ఆశీర్వాదంతో రాంగోపాల్‌పేట డివిజన్ ను గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసానని తాజా మాజీ కార్పోరేటర్ చీరె సుచిత్ర శ్రీకాంత్ అన్నారు.ప్రజలు,అధికారులు,ముఖ్యంగా డివిజన్ ప్రజల సహకారంతో డివిజన్‌లో ఎంతో ప్రగతి సాధించామన్నారు.బుధవారం పాన్‌బజార్‌లోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సంజీవయ్య పార్కులో కేంద్ర ప్రభుత్వ నిధులు రూ 50కోట్లతో లైటింగ్ ఏర్పాటు చేసామని,అదీ కాకుండా స్థానిక ఎంపీ,కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిధులు రూ ఒక కోటితో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేసామన్నారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వం నుండి సుమారు రూ 40కోట్ల మేర పలు అభివృద్ధి పనులు చేసామన్నారు.అందులో భాగంగా డ్రైనేజీ,మంచినీటిలైన్లు,నాలాల పూడిక తీత పనులు పూర్తి చేసామన్నారు.15కోట్ల రూపాయలతో 36చోట్ల నూతన రోడ్డును నిర్మించామన్నారు.నూతనంగా 225విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసామన్నారు.డివిజన్‌ను అభివృద్ధి చేసేందుకు అధికారులు పూర్తి సహాయ సహకారాలు అందించారని చెప్పారు.తాను కార్పోరేటర్ గా ఉన్న సమయంలోనే ప్రధాని నరేంద్రమోదీ,కేంద్ర హోంశాఖ మంత్రి అమీత్ షా,గుజరాత్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్‌లు సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి దర్శనానికి రావడం ఎంతో అదృష్టమన్నారు.

సొంత ఖర్చుతో పలు సేవా కార్యక్రమాలు.

తన సొంత ఖర్చుతో డివిజన్‌లో పలు సేవా కార్యక్రమాలు చేసానని,కరోనా సమయంలో 15రోజుల పాటు అన్నదానం చేసామన్నారు.ఆపదలో ఉన్న వారికి తనకు తోచిన సహాయం చేసామన్నారు.ఉచితంగా నిత్యావసర సరుకుల పంపిణీ, పాఠశాల,కళాశాల విద్యార్థులకు బుక్స్,బ్యాగ్‌లను పంపిణీ చేసామన్నారు.మెరిట్ స్టూడెంట్స్‌కు స్కాలర్ షిప్స్ అందించామన్నారు.

విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న తాజా మాజీ కార్పోరేటర్ చీరె సుచిత్ర శ్రీకాంత్.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ..

పేట్ బషీరాబాద్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త

జీడిమెట్ల 132వ డివిజన్ పరిధిలోని శ్రీ మల్లిఖార్జున స్వామి దేవస్థానంలో 55వ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ బుధవారం గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 15న ఆదివారం సాయంత్రం 4 గంటలకు గంగాస్నానం, రాత్రి 7 గంటలకు మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. అలాగే 16న సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు స్వామివారి కళ్యాణోత్సవం, మధ్యాహ్నం 2 గంటలకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతుంది. ఈ ఉత్సవాల్లో అగ్నిగుండాలు, బోనాలు, గొర్రెపోతుల బండితో ఊరేగింపు, గొలుసు తెంపుట వంటి ప్రత్యేక ఆచారాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు.

పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి..

నిజాంపేట్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త : పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా బుధవారం నిజాంపేట్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దాసి నాగరాజు, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు, కారుణ్య వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు పాల్గొని పూలమాలతో చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ దాసి నాగరాజు మాట్లాడుతూ దేశంలో చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమ ఫలాలు అందాలని పండిట్ దీన్ దయాల్ కోరినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కారుణ్య వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు అనిల్, భవాని, మణికంఠ, సుహర్షిణి, ప్రసాద్, పాండు, శివాజీ పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC

నిట్ నం. సంక్షిప్త టెండర్ ప్రకటన నం: 02/SE(M)SHBZ/GHMC/DEE(E)/2025-26, తేది: 10.02.2026. (7 రోజులు). **ఐటెమ్ నం.1. పని పేరు:** GHMC పరిధి, శంషాబాద్ జోన్‌లో వినియోగం కొరకు 5220 LED వీధి దీపాల యొక్క సేకరణ మరియు 5387 డ్రైవర్స్ యొక్క వివిధ వాట్టేజ్‌లు, టైప్‌లు & క్లాస్ వగైరా. **మొత్తం (రూ.లక్షలలో):** 93.00. **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు & సమయం:** బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 11.02.2026 మ.3.00 గం. డౌన్‌లోడ్ ముగింపు తేది: 19.02.2026 మ.03.00 గం. బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ & సమయం: 19.02.2026 మ.03.00. బిడ్ తెరచు తేది: 19.02.2026 మ.03.30 గం. ప్రైస్ బిడ్ తెరచు తేది: 19.02.2026 సా.04.00 గం. **అధికారి పేరు, చిరునామా: సెల్ నం.** శ్రీ డి. కిష్టప్ప, సూపరింటెండింగ్ ఇంజనీర్ (నిర్వహణ) శంషాబాద్ జోన్, GHMC, హైదరాబాద్ 9849906776. **మొత్తం: రూ.93.00 లక్షలు.** తదుపరి వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @www.tender.eprocurement.gov.in వద్ద చూడవచ్చును.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (నిర్వహణ), శంషాబాద్ జోన్, GHMC

DIPR.No.15240-PP/CL/Advt/1/2025-26, తేది: 11.02.2026

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE - CUM - VII ADDL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, AT: MEDCHAL.
O.S. No. 29 OF 2026.
BETWEEN:
Smt. D. Lavanya, and others, ...Plaintiffs
AND
1. The Tahsildar, Ameerpet, Hyderabad-500016.
2. All Concerned. ...Defendants

Please take notice that the above said plaintiffs filed O.S. No. 29 Of 2026 for declaration to declare that they are the legal Heirs of Late. Sir D. Narasimha and the same is stands posted to 09-03-2026 at 10.30 AM. If any person or persons have got any objection, may appear before the said Hon'ble court on the aforesaid date and time or else matter will be decided as per law.

//By order of the Hon'ble Court//.
Sd/- K. Ravi Kumar
Advocate
Counsel for Plaintiff,
Cell No. 9949970701.

No.1-A
Under ORDER-V, Rule 20 of CPC
IN THE COURT OF THE HON'BLE III ADDL. DISTRICT AND SESSIONS JUDGE, RANGA REDDY DISTRICT, AT LB NAGAR
O.S.No.47 of 2018
Between:-
Vattam Rajeshwar Rao, Died per Lr Vattam Lakshmi Rao & others ...Plaintiffs
And
Smt. Vattam Shakunthala died per Lrs, and others ...Defendants
To,
Defendants No.27
Smt. D. Rama Rani, W/o Dachapally Srinivasa Rao, Aged about 64 years, Occ.: House hold, R/o Vasavinagar, Opp.: Kharkana Police Station, Secunderabad, Telangana State.

Whereas, the above said plaintiffs instituted the above suit for partition, and you are hereby summoned to appear in before the III Addl. District and Sessions Judge, R.R. District, at LB Nagar, in person or by an advocate on 17/2/2026 at 10:30 AM to answer the same, failing which the above matter will be disposed of exparte.

//BY ORDER OF THE COURT//
KONDA SRINIVAS
Advocate
Off.: 3-3-222, LB.Nagar, Hyderabad, Telangana. Pin Code: 500074
M: 9030923923

No.1-A
Under ORDER-V, Rule 20 of CPC
IN THE COURT OF THE HON'BLE III ADDL. DISTRICT AND SESSIONS JUDGE, RANGA REDDY DISTRICT, AT LB NAGAR
O.S.No.47 of 2018
Between:-
Vattam Rajeshwar Rao, Died per Lrs Vattam Lakshmi Rao & others ...Plaintiffs
And
Smt. Vattam Shakunthala died per Lrs, and others ...Defendants
To,
Defendants No.28 to 32
1. **BOGGARAPU RAJENDER,** S/o Late. B. Ramulu, Aged about 72 years, Occ.: Business.
2. **BOGGARAPU GNANESHWAR,** S/o Late. B. Ramulu, Aged about 68 years, Occ.: Business.
3. **BOGGARAPU DAYANAND,** S/o Late. B. Ramulu, Aged about 64 years, Occ.: Business.
4. **BOGGARAPU KARUNAKAR,** S/o Late. B. Ramulu, Aged about 60 years, Occ.: Business.
5. **BOGGARAPU PARAMESHWAR,** S/o Late. B. Ramulu, Aged about 57 years, Occ.: Business. All are R/o 15-4-226, Gowliguda Chaman, Hyderabad, State of Telangana.

Whereas, the above said plaintiffs instituted the above suit for partition, and you are hereby summoned to appear in before the III Addl. District and Sessions Judge, R.R. District, at LB Nagar, in person or by an advocate on **17/2/2026 at 10:30 AM** to answer the same, failing which the above matter will be disposed of exparte.

//BY ORDER OF THE COURT//
KONDA SRINIVAS
Advocate
Off.: 3-3-222, LB.Nagar, Hyderabad, Telangana. Pin Code: 500074
M: 9030923923

IN THE COURT OF HON'BLE PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE-CUM-FAMILY COURT ; AT MALKAJGIRI
O.S.NO. 83 / 2018
Between:-
Plaintiffs Sagi Suryanarayana Raju & others ...Plaintiffs
And
V. Venkatesham & Others ...Defendants
To
1. **Vasagoni Venktesham,** S/o Late Srinivas, R/o H.No. 3-6-116, Dhobiwada, Bhongir, Nalgonda District, T.S. (Defendant No. 1)
2. **Smt. Vasagoni Lalitha,** W/o Late Chandra Sheker, R/o H.No. 2-46, Nagireddypalli, Bhongir, Nalgonda District, T.S. (Defendant No. 2)
3. **Smt. Vasagoni Sithara,** W/o Late V. Mallesh, R/o H.No. 1-3-219/1, Vidya Nagar, Bhongir, Nalgonda District, T.S. (Defendant No. 3)
4. **Vasagoni Manikumar,** S/o Late Srinivas, R/o H.No. 3-8-116, Kamuni Kantha, Bhongir, Nalgonda District, T.S. (Defendant No. 4)
5. **Vasagoni Anjaneyulu,** S/o Late Srinivas R/o H.No. 3-8-116, Kamuni Kantha, Bhongir, Nalgonda District, T.S. (Defendant No. 6)
6. **Vasagoni Swamy,** S/o Late Srinivas R/o H.No. 3-8-116, Kamuni Kantha, Bhongir, Nalgonda District, T.S. (Defendant No. 7)

[Defendant No.1 to 7 are represented by their regd GPA Holder M/s OTIS Infra Developers, Partnership firm Office at 5-3-125, Main Road, Yapral Village, Malkajgiri Mandal, R.R. District represented by its by its partners N. Sanjeeva Rao, T.Srinivas Reddy and T.Linga Rao vide Registered GPA NO.6252/2015 and 6253/215 22.07.2015]

7. **Sri N. Jerome, S/o N. Philiph,** R/o H. No. 3-80, Dhannaram (B), Dichpally (M), Nizamabad District - 503230 (Defendant No. 9)
8. **Pothi Reddy Gopal Reddy,** S/o Ranga Reddy, R/o H.No.1-8-69/3, Plot No. 16, R.K. Nagar, Temple Alwal, Secunderabad-500010 (Defendant No. 10)

Take notice that the above-named plaintiffs filed suit against you for Cancellation of the Registered Sale Deed. You are hereby summoned to appear in this court in person or by pleader duly instructed and able to answer all material questions on **11.03.2026 at 10.30 AM.** Take notice that in default of your appearance the suit will be heard and decided in your absence.

By order of the Court.
Sd/- V. SETHU MADHAVA RAO,
V. DYUMANI, Advocates
3-5-873/A-407 Mathrusri Apts., Hyderguda, Hyd-29, **Cell No. 9393009284, 9440933075**
Counsel for the Plaintiff

ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో జూబ్లీహిల్స్ కార్పొరేటర్

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త: బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 13లోని శ్రీ నల్ల పోచమ్మ దేవాలయంలో నిర్వహించిన దేవి 18వ వార్షికోత్సవ వేడుకల్లో జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ పాల్గొన్నారు. ఆలయ వ్యవస్థాపక సభ్యులు గోగుల రమేష్ ఆహ్వానం మేరకు ఆయన ఇక్కడికి విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బంజారాహిల్స్ డివిజన్ నాయకులు జేజోల్ల రాజు ముదిరాజ్, మహేష్, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

కార్పొరేటర్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు.

చిన్న కమేళాలో ఘనంగా కల్లుగుడాల వేడుకలు

కంటోన్మెంట్,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: తిరుమలగిరి లాల్ బజార్‌లోని చిన్న కమేళా బస్తీలో ప్రసిద్ధిగాంచిన శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో బుధవారం నిర్వహించిన కల్లుగుడాల వేడుకలకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బానుక మల్లికార్జున్,తిరుమలగిరి ఏసీపీ రమేశ్, మహంకాలి జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు బి.ఎన్.శ్రీనివాస్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను స్థానిక నాయకులు, ఆల య ఆర్గనైజర్లు మోహన్, అనూప్,వేణు,మహేశ్‌లు ఘనంగా సత్కరించారు.

కల్లుగుడాలు వేడుకల్లో పాల్గొన్న బిజెపి నేత బానుక మల్లికార్జున్ తదితరులు

వ్యాపార సముదాయ యజమానులతో పోలీసుల సమావేశం

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త : కెపిహెచ్‌బి కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న షాపులు, వ్యాపార సముదాయాల యజమానులతో కెపిహెచ్‌బి పోలీసులు హౌసింగ్ బోర్డ్ కమ్యూనిటీ హాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కెపిహెచ్‌బి ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ వ్యాపారులు చట్టబద్ధమైన నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. షాపులు, వ్యాపార సముదాయాల యజమానులు తప్పనిసరిగా జీహెచ్ఎంసీ అనుమతి, ట్రేడ్ లైసెన్స్, జీఎస్టీ నమోదు, లేబర్ లైసెన్స్, ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అనుమతించిన వేళల్లోనే వ్యాపారాలను నిర్వహించుకోవాలన్నారు. సమయపరిమితులు పాటించాలన్నారు. దుకాణాల వద్ద అక్రమ కార్యకలాపాలు, జూదానికి పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్య

దేవాలయం అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు : కొమిరెల్లి రాజశేఖర్ రెడ్డి

ఓల్డ్ మలక్ పేట్ శ్రీ పోచమ్మ దేవాలయం మాజీ చైర్మన్ కొమిరెల్లి రాజశేఖర్ రెడ్డిని సన్మానిస్తున్న శ్రీ పోచమ్మ దేవాలయం వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ తదితరులు

మలక్ పేట, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త: దేవాలయం అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని శ్రీ పోచమ్మ దేవాలయం కమిటీ మాజీ చైర్మన్ కొమిరెల్లి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీ పోచమ్మ దేవాలయం కమిటీ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం కొమిరెల్లి రాజశేఖర్ రెడ్డిని శాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం కొమిరెల్లి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నూతన కమిటీకి తమ వంతు పూర్తిగా సహకరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాటికొండ శ్యామ్, షేర్ రామకృష్ణ, హనుమంతు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను సిజ్ చేసిన అధికారులు

మల్కాజిగిరి ఫిబ్రవరి 11, ప్రభాతవార్త: మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని మల్కాజిగిరి సర్కిల్ ఏసిపి శ్రీనివాసరావు పేర్కొన్నారు . మల్కాజ్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీలలో నిబంధనల విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపట్టిన భవనాలను బుధవారం అధికారులు సీజ్ చేశారు. గౌతమ్ నగర్ , పివిఎన్ కాలనీ నర్సింహారెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో నాలుగు భవనాలను సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పని ఎ సి పి శ్రీనివాసరావు హెచ్చరించారు.

శాంతిభద్రతలను కాపాడడమే పోలీసుల కర్తవ్యం : ఇన్‌స్పెక్టర్ నరేష్

బదిలీ అయిన డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ జయశంకర్ ను సన్మానిస్తున్న ఇన్ స్పెక్టర్ పిడమర్తి నరేష్ , చిత్రంలో ఎస్ఐ లు రాజశేఖర్ రెడ్డి, కిరణ్ లాల్, తేజ్ నాయక్ తదితరులు

మలక్ పేట, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త: శాంతి భద్రతలను కాపాడడమే పోలీసుల కర్తవ్యమని మలక్ పేట్ ఇన్ స్పెక్టర్ పిడమర్తి నరేష్ పేర్కొన్నారు. మలక్ పేట పోలీస్ స్టేషన్ లో డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న జయశంకర్ సైబర్ క్రైమ్స్ విభాగానికి ఇన్ స్పెక్టర్ గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మలక్ పేట పోలీస్ స్టేషన్ లో ఇన్ స్పెక్టర్ పిడమర్తి నరేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇన్ స్పెక్టర్ జయశంకర్ ను శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ లు రాజశేఖర్ రెడ్డి, కిరన్ లాల్, తేజ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో చక్కటి ఆరోగ్యం : చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి

పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ప్రిన్సిపాల్ చిన్నారెడ్డి తదితరులు

మలక్ పేట, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త: క్రీడలతో చక్కటి ఆరోగ్యం చేకూరుతుందని ప్రగతి డిగ్రీ కాలేజ్ (కో ఎడ్యుకేషన్) చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. దిల్ షుక్ నగర్ లోని ప్రగతి డిగ్రీ కాలేజీ (కోఎడ్యుకేషన్) ఆధ్వర్యంలో స్పోర్ట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. స్పోర్ట్స్ డే కార్యక్రమాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వివిధ ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో చక్కటి ఆత్మవిశ్వాసం పెంపొందించడంతోపాటు శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణ, అంకితభావంతో తమ లక్ష్యసాధన కోసం కృషి చేయాలని కోరారు. అత్యుత్తమ ఉపాధ్యాయ బృందంతో ఆధునాతన పద్ధతిలో తమ పాఠశాల విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధిస్తున్నామని తెలిపారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కాలేజ్ ప్రిన్సిపాల్ టీ. చిన్నారెడ్డి మాట్లాడుతూ స్పోర్ట్స్ డేని పురస్కరించుకుని విద్యార్థులకు క్రికెట్, కబడ్డీ, కోకో, వాలీబాల్ తదితర పోటీలను నిర్వహించడం జరిగిందని, పోటీలలో గెలుపొందిన వారికి బహు మతులను అందజేశామని వివరించారు. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి పలు కార్యక్రమాల నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్ బాబును సత్కరించిన కాంగ్రెస్ నేతలు

మంత్రి శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న గణేష్ నేత

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: ఎల్బీనగర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఐటి ఇండస్ట్రియల్ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావ్, శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయం చైర్మన్ తల్లాటి రమేష్ నేత, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు జెల్లా జగన్నాథం.. తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా వైశ్యరాజు జ్యుయలర్స్ నూతన షోరూం

-షోరూంను ప్రారంభించిన సినీ తార కాజల్ అగర్వాల్

షో రూమ్ ను ప్రారంభిస్తున్న సినీ తార కాజల్ అగర్వాల్ తదితరులు

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీ తార కాజల్ అగర్వాల్

మలక్ పేట జోన్ ప్రతినిధి, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త: నగరంలోని సోమాజిగూడ లో నూతనంగా ఏర్పాటు చేసిన వైశ్యరాజు జ్యుయలర్స్ నూతన షోరూమ్ ను సినితార కాజల్ అగర్వాల్ ప్రారంభించారు. షోరూంలో మొదటి కొనుగోలును జామి భోజరాజు చేశారు. వైశ్యరాజు జ్యుయలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ వైశ్యరాజు భద్రగిరి రాజు మాట్లాడుతూ మా ప్రయాణం ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నంలో ప్రారంభమై నేడు హైదరాబాద్ సోమాజిగూడ లో 16వ బ్రాంచ్ ను ప్రారంభించడం జరిగిందని వివరించారు. ప్రారంభోత్సవ ఆఫర్ గా అన్ని రకాల 22 కేటి బంగారు ఆభరణాలపై ఫ్లాట్ ఆరు శాతం తరుగుకే ఆభరణాలను పొందవచ్చునని వివరించారు. వివిఎస్ క్లారిటీ, ఈఎఫ్ కలర్, ఐజిఐ సర్టిఫైడ్ డైమండ్ క్యారెట్స్ రూ. 49,500ల నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు అదేవిధంగా సాధారణ వెండి వస్తువులపై ఎటువంటి తరుగు లేదని, మజూరీ లేదని జీఎస్టీని కూడా మీ తరఫున మేమే చెల్లిస్తామని పేర్కొన్నారు. అదనంగా కేజీ వెండి వస్తువుల కొనుగోలుపై రు. 15వెల వరకు తగ్గించనునట్లు తెలిపారు. ఈ ఆఫర్ కొన్ని రోజులు మాత్రమేనని, ప్రతి ఒక్కరు షోరూంకి విచ్చేసి మా ప్రత్యేకమైన డిజైనరి కలెక్షన్లను ఎంపీక చేసుకొని ఈ ఆఫర్స్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైశ్యరాజు జుయలర్స్ చైర్మన్ వైశ్యరాజు ఫల్గుణ రాజు, డైరెక్టర్లు వైశ్యరాజు నరేష్, వైశ్యరాజు కిరణ్ కుమార్, రాజు పాల్గొన్నారు.

రూ.168 కోట్ల అభివృద్ధితో నేరెడ్‌మెట్-యాప్రాల్‌కు కొత్త రూపం

-ఐదేళ్ల పాలనను స్వర్ణయుగంగా పేర్కొన్న మాజీ కార్పొరేటర్ కొతపల్లి మీనా ఉపేందర్ రెడ్డి

నేరెడ్‌మెట్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: నేరెడ్‌మెట్ 136వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొతపల్లి మీనా ఉపేందర్ రెడ్డి ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గత ఐదేళ్లు నేరెడ్‌మెట్-యాప్రాల్ ప్రాంతాల అభివృద్ధి చరిత్రలో స్వర్ణయుగంగా నిలిచిపోతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ ఐదేళ్ల కాలంలో రికార్డు స్థాయిలో రూ.168 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. రోడ్లు, డ్రైనేజీలు, థీమ్ పార్కులు, కమ్యూనిటీ హాల్లు, శ్మశానవాటికలు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి మాత్రమే రూ.108 కోట్ల పనులు చేపట్టినట్లు తెలిపారు. బాక్స్ డ్రెయిన్లతో వరద సమస్యకు శాశ్వత పరిష్కారం డివిజన్‌లో తరచూ ఎదురయ్యే వరద సమస్యకు పరిష్కారంగా రూ.53 కోట్లతో బాక్స్ డ్రెయిన్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు చెప్పారు. యాప్రాల్‌లో నాగి రెడ్డి చెరువు నుంచి కాప్రా చెరువు వరకు రూ.43 కోట్లతో ప్రధాన డ్రెయిన్ నిర్మాణం, ఎంప్లాయిస్ కాలనీలో రూ.6 కోట్లు, అందాల్ హోమ్స్‌లో రూ.2 కోట్లు, బ్యాంక్ కాలనీలో రూ.3 కోట్లతో డ్రెయిన్ల పనులు పూర్తయ్యాయని వివరించారు. చెరువుల సుందరీకరణ, భద్రతపై ప్రత్యేక దృష్టిఆర్‌కేపురం చెరువు సుందరీకరణకు రూ.6 కోట్లు, నేరెడ్‌మెట్ ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి రూ.1 కోటి వెచ్చించినట్లు తెలిపారు. ప్రజా భద్రతను దృష్టిలో ఉంచుకుని రూ.30 లక్షలతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటిని పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేసినట్లు చెప్పారు. ఎంపీ సహకారంతో అదనపు అభివృద్ధిఈటల రాజేందర్ మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన తరువాత డివిజన్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు. ఎంపీ సిఫారసు లేఖల ద్వారా సుమారు రూ.4.16 కోట్ల విలువైన పనులకు మంజూరులు లభించాయని తెలిపారు. అమ్ముగూడ శ్మశానవాటిక అభివృద్ధి, కాలనీల్లో కొత్త బోర్‌వెల్స్ ఏర్పాటు, కొన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు ఈ నిధులతో చేపట్టామని వివరించారు. డివిజన్‌లో సగానికి పైగా కాలనీల్లో 100 శాతం మౌలిక వసతులు కల్పించామని, మొత్తం మీద 60-70 శాతం అభివృద్ధి పనులు పూర్తయ్యాయని చెప్పారు. మిగిలిన పనులు కూడా త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ఐదేళ్ల కాలంలో తమకు అండగా నిలిచిన కాలనీ అధ్యక్షులు, సభ్యులు, అధికార యంత్రాంగం, మీడియా మిత్రులు మరియు ప్రజలందరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పదవి ముగిసినా సేవ ఆగదని, నేరెడ్‌మెట్-యాప్రాల్ అభివృద్ధి కోసం ఎప్పటికీ ముందుండే నాయకత్వం తమదేనని ధీమా వ్యక్తం చేశారు.

ఐదేళ్లలో వినాయకనగర్ అభివృద్ధికి రూ.65 కోట్లు : మాజీ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

నేరేడ్ మెట్,వినాయకనగర్, ఫిబ్రవరి 11,ప్రభాతవార్త : వినాయకనగర్ డివిజన్‌లో ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి తన సేవా కాలానికి సంబంధించిన ముఖ్యాంశాలను వెల్లడించారు. 2021 ఫిబ్రవరి 11న బాధ్యతలు స్వీకరించినప్పుడు డివిజన్‌లో మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉన్నదని ఆమె గుర్తుచేశారు. ప్రధాన రహదారులపైనా డ్రెయిన్ల లీకేజీలు సమస్యగా ఉండేవని తెలిపారు. నిధుల కొరత, పరిమితుల మధ్య కూడా ప్రజల సహకారంతో మరియు జిహెచ్ఎంసి, నీటి బోర్డు, విద్యుత్ శాఖల సమన్వయంతో సుమారు రూ.65 కోట్ల నిధులు సమీకరించి డివిజన్ అభివృద్ధికి వినియోగించామని తెలిపారు. ముఖ్యంగా వరద సమస్య పరిష్కారానికి 19 స్టార్మ్ వాటర్ డ్రెయిన్లు (ఆర్‌సీసీ పైప్ లైన్లు, బాక్స్ డ్రెయిన్లు) నిర్మించామని వివరించారు. దీనదయాళ్‌నగర్, కాకతీయనగర్, జె.కె.కాలనీ, రేణుకానగర్, శివనగర్, వినోభానగర్, చంద్రగిరి కాలనీ, వినాయకనగర్ బస్తీ, ఈస్ట్ ఆనంద్‌బాగ్ ప్రాంతాల్లో ఈ పనులు చేపట్టడంతో వరద ముప్పు గణనీయంగా తగ్గిందన్నారు. తన పదవీకాలంలో డివిజన్‌లో సుమారు 80 శాతం రహదారులు, 60 శాతం భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. తాగునీటి సరఫరా క్రమబద్ధీకరణ, పైప్‌లైన్ల మార్పులు, నీటి ఒత్తిడి సమస్యల పరిష్కారం వంటి అంశాల్లో చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా విషయంలో సింగిల్ ఫేజ్ లైన్లను త్రీఫేజ్‌గా మార్పు చేయడం, కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం, వంగిన స్తంభాలను సరిచేయడం, అధిక సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లు ప్రతిష్ఠించడం వంటి పనులు చేపట్టామని తెలిపారు. బండచెరువులోకి ప్రవేశిస్తున్న మురుగు నీటిని రూ.2.4 కోట్ల వ్యయంతో ఆర్‌సీసీ పైప్ లైన్ ద్వారా లాలాపేట ప్రధాన లైన్‌కు మళ్లించినట్లు తెలిపారు. బండచెరువు వాకర్స్ పార్క్, బేబీ పాండ్ వద్ద వీధిదీపాలు, బోర్‌వెల్ ఏర్పాటు చేసి పచ్చదనాన్ని పెంపొందించామని వివరించారు. చెరువు శుభ్రత కోసం రూ.15 లక్షలతో డిసిల్టింగ్ పనులు చేపట్టామని తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ సంఘాలు, ప్రజలు, జిహెచ్ఎంసి సిబ్బంది, నీటి మరియు విద్యుత్ శాఖల అధికారులు, పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు, మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఐదేళ్ల సేవా కాలం తనకు అపార సంతృప్తిని ఇచ్చిందని, ప్రజలతో కలసి పనిచేసే అవకాశం దక్కడం తన అదృష్టమని క్యానం రాజ్యలక్ష్మి పేర్కొన్నారు.

మినీ ట్యాంక్‌బండ్‌గా మారనున్న ఉప్పల్ నల్ల చెరువు

శరవేగంగా అభివృద్ధి పనులు..మరో రెండు నెలల్లో పూర్తి



మినీ ట్యాంక్‌బండ్‌గా ముస్తాబు అవుతున్న ఉప్పల్ నల్ల చెరువు మాడల్ దృశ్యం.

ఉప్పల్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : ఉప్పల్ నల్ల చెరువు సర్వంగా సుందరంగా ముస్తాబు అవుతోంది. హైడ్రా ఆధ్వర్యంలో నల్ల చెరువును అధికారులు మరో మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దుతున్నారు. సుమారు 65.96 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఉప్పల్ నల్ల చెరువులో నీటి నిల్వ ఉన్న ప్రాంతం సుమారు 42.50 ఎకరాలు ఉంది. మొత్తం 58.56 ఎకరాల విస్తీర్ణంలో చెరువును అభివృద్ధి చేస్తున్నారు. ఉప్పల్ ప్రాంత ప్రజలకు మురుగునీరు, దోమల బెడతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు మరో రెండు నెలల్లోగా ఉపశమనం లభించనుంది. చెరువు సుందరీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే చెరువు చుట్టూ బండ్ వేసే పనులు పూర్తి చేశారు. చెరువు మధ్యలో ప్రత్యేకంగా నీటి ఫౌంట్ నిర్మిస్తున్నారు. ఉప్పల్ నుంచి వరంగల్, కరీంనగర్ వెళ్లే ప్రజలకు ఇక నుంచి చెరువు వద్ద సేద తీరేందుకు వివిధ ఏర్పాట్లు చేస్తున్నారు. చెరువు వద్ద ప్రత్యేకంగా పూల మొక్కలతో ఆలంకరణ చేపట్టారు. చెరువు బండ్‌పై ప్రత్యేక వీధిదీపాలతోపాటు, లైటింగ్ సౌకర్యం కల్పిస్తున్నామని అధికారులు తెలిపారు.

మరో బతుకమ్మ కుంటగా ఉప్పల్ నల్ల చెరువు : ఉప్పల్ నల్ల చెరువును అధికారులు మరో బతుకమ్మ కుంటగా తీర్చిదిద్దుతున్నారు. చెరువు పరిసరాల్లో ఆహ్లాదం కోసం ప్రత్యేకంగా పూలమొక్కలు నాటుతున్నారు. చెరువు చుట్టూ పాదచారులు ప్రయాణించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. చెరువు కట్టపై ప్రత్యేకంగా కుర్చీలు, బల్లలు ఏర్పాటు చేస్తున్నారు. సుమారు రూ.38 కోట్ల వ్యయంతో చేపడుతున్న చెరువు సుందరీకరణ పనులు మరో రెండు నెలల్లోగా పూర్తి చేస్తామని హైడ్రా అధికారులు పేర్కొంటున్నారు. నల్ల చెరువు నుంచి ఉప్పల్ మల్లికార్జుననగర్ కాలనీ మీదుగా స్వరూప్‌నగర్ ప్రయాణించేందుకు రహదారి ఏర్పాటు చేస్తున్నారు. పనులు త్వరలోనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకుని వస్తామని అధికారులు పేర్కొంటున్నారు. నల్ల చెరువు అభివృద్ధితో ఉప్పల్ పరిసర ప్రాంతాల మూసీ నీటి నుంచి కొంత విముక్తి లభించనుంది.

ఎంఐఎం పార్టీకి మేయర్ పీఠం కట్టబెట్టడానికే జిహెచ్ఎంసిని పునర్విజన చేశారా?

-ధ్వజమెత్తిన మహేశ్వరం బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్

ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న అందెల శ్రీరాములు యాదవ్

సరూర్‌నగర్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: ఎంఐఎం పార్టీకి మేయర్ పీఠాన్ని కట్టబెట్టడానికే జిహెచ్ఎంసిని పునర్విభజన చేసినట్లుందని మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అందెల శ్రీరాములు యాదవ్ ఆరోపించారు. 300 డివిజన్లతో పునర్విభజన చేసిన గ్రేటర్‌లో హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లను విభజిస్తూ ప్రభుత్వం జిఓ నెంబర్ 55ను విడుదల చేసిన నేపథ్యంలో అందెల స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్, జల్‌పల్లి సర్కిళ్ళతో పాటు ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఆదిభట్ల సర్కిల్‌ను, రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని రాజేంద్రనగర్ సర్కిల్‌తో పాటు శంషా బాద్ సర్కిల్‌ను శంషాబాద్ జోన్ కిందకు తీసుకువచ్చి ఆ జోన్ మొత్తాన్ని హైదరాబాద్ కార్పొరేషన్‌లో విలీనం చేయడంపై మండిపడ్డారు. దీనిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. దీని వల్ల రంగారెడ్డి జిల్లా అస్తిత్వం దెబ్బతింటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లను పక్కన బెడితే హైదరాబాద్ కార్పొరేషన్‌ను కేవలం ఎంఐఎంకు కట్టబెట్టడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విధమైన నిర్ణయం తీసుకుందని ఆయన దుయ్యబట్టారు. స్థానిక నియోజకవర్గాల ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రకాశ్‌గౌడ్‌లు సైతం స్పందించి ప్రభుత్వ నిర్ణయాన్ని పునః పరిశీలించే విధంగా కోరాలని ఆయన అన్నారు. ఇక్కడి ప్రజల అభిప్రాయాలను గౌరవించి ప్రభుత్వం హైదరాబాద్‌లో కలపకుండా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలి : ఎమ్మెల్యే బలాల

విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

మలక్ పేట, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త: విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని మలక్ పేట్ నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. రానున్న రంజాన్ మాసం, వేసవికాలాన్ని పురస్కరించుకొని విద్యుత్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే బలాల సమీక్ష సమావేశాన్ని నిర్వహించి పలు అంశాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గం ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో నూతన ట్రాన్స్‌ఫార్మర్లలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ ఇ శ్రీనివాసరావు, ఆస్మాన్ ఘాడ్ విద్యుత్ శాఖ డిఇ విష్ణువర్ధన్ రెడ్డి, ఎఇ లు సంతోష్ బాబు, సత్యనారాయణ, కార్పొరేటర్ సలాం షాహిద్, నాయకులు అబ్రార్, సైఫుద్దిన్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా బాజా కృష్ణ

జిల్లా అధ్యక్షుడు బాజా కృష్ణను అభినందిస్తున్న లాలాపేట్ మున్నూరు కాపు సంఘం నాయకులు

తార్నాక, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : మున్నూరు కాపు సంఘం తెలంగాణ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా నిజాంపేట్ మండలానికి చెందిన బాజా కృష్ణను నియమించారు. ఈ మేరకు నగరంలోని రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నియామక పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షులు వనమాల ప్రవీణ్ కుమార్ ఆయనకు అందజేశారు. మున్నూరు కాపు యువత రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజీవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యాదక్రాంతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారి అనిల్, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంత శివకుమార్, యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామల లవ కుమార్, రాష్ట్ర సోషల్ మీడియా ఇంచార్జి ఏర్రం సంజీవ్, యువత రాష్ట్ర కార్యదర్శి అకుల నాగరాజు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మామిడి బాలకృష్ణ, గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు గర్స మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సంఘ బలోపేతానికి, మున్నూరు కాపు సమాజ అభివృద్ధికి బాజా కృష్ణ కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లాలో సంఘ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

నాలా నిర్మాణం పూర్తయితే వరదనీటి సమస్యకు పరిష్కారం : ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

సైదాబాద్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: చంపాపేట డివిజన్ ఉదయ్ నగర్‌లో చేపడుతున్న నాలా నిర్మాణం పూర్తయితే స్థానికంగా వరదనీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ నాయకులు గండికోట శ్రీనాథ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉదయ్‌నగర్, సూర్యనగర్, ఎంఆర్ఆర్ కాలనీ, పవన్‌పురి కాలనీ, పద్మానగర్, న్యూ పద్మానగర్ కాలనీవాసులతో కలిసి నాలా నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. నాలా విస్తరణ పనులకు స్థానికులు ముందుకు వచ్చి స్వంతంగా తమ స్థలాలను ఇవ్వడం జరిగిందని, అయితే ఒక వ్యక్తి రెండున్నర ఫీట్ల స్థలం ఇస్తే పనులు కొనసాగుతాయని ఎమ్మెల్యేకు తెలపడంతో, సదరు ఇంటి యజమానితో ఎమ్మెల్యే మాట్లాడారు. నాలా విస్తరణకు అవసరమైన స్థలం ఇచ్చి పనులు పూర్తి చేయడానికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ ఏసిపి ప్రతాప్, ఈఈ కార్తీక్, ఏఇ సురేష్, బిఆర్ఎస్ నాయకులు ముడుపు రాజిరెడ్డి, సుంకోజు కృష్ణమాచారి, బొక్క సదానందరెడ్డి, రవి ముదిరాజ్, ఓరుగంటి వెంకటేషం, రోజారెడ్డి, చీర శ్రీనివాస్, సిహెచ్ యాదిరెడ్డి, ముద్ద కళ్యాణ్, మల్లేష్‌గౌడ్, కొత్తపేట ప్రభాకర్, అంజిరెడ్డి, సురేందర్‌రెడ్డి, జగదీష్, చందు, రమాదేవి, వసంత, కనకేష్ తదితరులు పాల్గొన్నారు.

గుంతల మయంగా మారిన రోడ్డుకు మరమ్మతు పనులు

రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులు పర్యవేక్షిస్తున్న రాజిరెడ్డి, సదానందరెడ్డి

సైదాబాద్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: గుంతలమయంగా మారిన కర్మన్‌ఘాట్‌లోని శివాలయం ముందున్న రోడ్డును రాబోయే మహా శివరాత్రి పండుగను దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు, సిబ్బందిని పిలిపించి బిఆర్ఎస్ నాయకులు మరమ్మత్తు పనులు చేయించారు. స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యల